ప్రతిపక్షం

www.prathipaksham.in

బుధవారం 24.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 274 పేజీలు:8 | ₹5


@prathipaksham | prathipaksham tv telugu



రెండో టీ20లో వుమెనిండియా విజయం 8

ఒక్క ఎకరాకూ నీళ్లు ఇవ్వలేదు

- 'పాలమూరు' పై బీఆర్ఎస్ అబద్ధాలు
- రెండేళ్లలో రూ.7 వేల కోట్లు ఖర్చు చేశాం
- మూడేళ్లలో ఎస్ఎల్బీసీ ప్రాజెక్టును పూర్తి చేస్తాం
- హరీశ్‌లాగ కమీషన్లు మాకు అలవాటు లేదు
- బీఆర్ఎస్ నేతలు దుర్మార్గంగా మాట్లాడుతున్నారు
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్23: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.27 వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరాకు కూడా నీరు ఇవ్వలేదని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. సచివాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలమూరు ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నాయకులు దుర్మార్గంగా బరితెగించి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం రెండేళ్లలోనే పాలమూరు ప్రాజెక్టుకు రూ.7 వేల కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. పాలమూరు ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులే లేకుండా అప్పటి సీఎం కేసీఆర్ అబద్ధాలు చెప్పారని ఆరోపించారు. 45 టీఎంసీలకు ఒప్పుకున్నారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, మాజీ మంత్రి హరీష్‌రావు తెలివితో మాయమాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. హరీష్‌రావు చేసిన విచిత్రమైన, వికృత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

పాలమూరు ప్రాజెక్టు కట్టాలనే ఉద్దేశమే లేదు

కేసీఆర్ ప్రభుత్వానికి పాలమూరు ప్రాజెక్టు కట్టాలనే ఉద్దేశమే లేదని స్పష్టం చేశారు. 2020లో కేంద్రానికి పంపిన నీటి వాటాల పంపకాల్లో పాలమూరు, ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులకు నీళ్లు కూడా

...:: మిగతా 2లో



జవాబుదారి తనంతో పని చేయండి

ప్రతి నెలా సీఎస్‌కు నివేదిక ఇవ్వాలి

మూడు నెలలకు ఒకసారి స్వయంగా సమీక్షిస్తా

ఐఏఎస్ అధికారులు ప్రతి పది రోజులకోసారి క్షేత్రస్థాయికి వెళ్లాలి. నెలలో కనీసం మూడు సార్లు తమ శాఖ పరిధిలో ఏం జరుగుతుందో పరిశీలించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రతి నెలా సీఎస్‌కు అధికారులు తమ పనితీరుపై నివేదికలు సమర్పించాలని స్పష్టం చేశారు. ప్రతి నెల సీఎస్‌సీఎస్ సమీక్షిస్తారని, మూడు నెలలకు ఒకసారి స్వయంగా తానే సమీక్షిస్తానని సీఎం అధికారులకు వివరించారు. ప్రభుత్వం ఎంతో గొప్ప కార్యాచరణ తీసుకున్నా అధికారుల సహకారం ఉండాలన్నారు. అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

- సమన్వయం లేకుంటే ఫలితాలు రావు
- ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పనిచేయాల్సిందే
- ఈ రెండేళ్లలో కొన్ని విజయాలు సాధించాం
- కొన్ని ప్రణాళికలు రూపొందించుకున్నాం
- సీఎస్ఎస్ నిధులను సద్వినియోగం చేసుకోవాలి
- అద్దె భవనాలలో కార్యాలయాలు వద్దు
- కొత్త భవనాల నిర్మాణానికి అంచనాలివ్వండి
- ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు
- ప్రభుత్వ కార్యదర్శులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 23: ప్రభుత్వ అధిరారుల్లో జవాబుదారి తనం పెరగాలని, దీంతో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న పథకాలు, అభివృద్ధి ప్రజలకు చేరుతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం సచివాలయంలో ప్రభుత్వ కార్యదర్శులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సీఎస్‌రామకృష్ణారావు పాల్గొన్నారు .ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో గొప్ప కార్యాచరణ తీసుకున్నా అధికారుల సహకారం ఉండాలన్నారు. అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలని దశ, దిశా నిర్దేశనం చేశారు. విజన్ అంటే కేవలం ప్రచారానికి పరిమితమనే అపోహను తిప్పికొట్టేలా, విజన్లో ఉన్న ప్రతి అంశం అమలు చేసేందుకు వెంటనే నడుం బిగించాలని అన్ని విభాగాల ఉన్నతాధికారులను సీఎం అప్రమత్తం చేశారు. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకుంటున్నామని సీఎం


...:: మిగతా 2లో



రాజ్యాంగం రద్దుకు బీజేపీ కుట్ర

భారత రాజ్యాంగాన్ని రద్దు చేయడమే లక్ష్యంగా బీజేపీ నేతలు ఆలోచిస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. జర్మనీ పర్యటనలో రాహుల్ గాంధీ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

7



బిహార్ అభివృద్ధిపై ప్రశంసలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అధికార బీజేపీపై ప్రశంసలు కురిపిస్తూ సొంత పార్టీ నేతల నుంచి తరచు విమర్శలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

7

నదీ జలాలపై సీఎంకు అవగాహన లేదు



- సాగునీటిపై మంత్రులది అంతులేని అజ్ఞానం
- కేసీఆర్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక డ్రామాలు
- కేసులు, బెదిరింపులకు బీఆర్ఎస్ లొంగదు
- 'పాలమూరు' ప్రాజెక్టును అడ్డుకుంటున్న కాంగ్రెస్
- కాంగ్రెస్ ప్రభుత్వానికి '420' హామీల భయం
- అందుకే ఎన్నికల నిర్వహణ నుండి పరార్
- దమ్ముంటే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి
- కాంగ్రెస్ ప్రభుత్వానికి కేటీఆర్ బహిరంగ సవాల్
- ప్రభుత్వాన్ని నిలదీయాలని కార్యకర్తలకు పిలుపు
- నల్లగొండలో నూతన ప్రజాప్రతినిధుల అభినందన సభ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్/ నల్గొండ, డిసెంబర్ 23: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధితో ఉంటే వెంటనే సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డ్ మెంబర్ల అభినందన సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రజాప్రతినిధులను అభినందించి సన్మానించారు.

ముఖ్యమంత్రిపై ఘాటైన విమర్శలు

రేవంత్ రెడ్డి కాలక్షేపం రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రికి దమ్ముంటే, వెనుక నుండి లీకులు ఇవ్వడం మానేసి, నేరుగా కెమెరా ముందుకు వచ్చి ఏ కేసు పెడుతున్నారో చెప్పాలని సవాల్ విసిరారు. హోం మంత్రి కూడా ఆయనే కాబట్టి, ధైర్యంగా ముందుకు వచ్చి మాట్లాడాలని, శిఖండి రాజకీయాలు చేయడం తగదని విమర్శించారు. ప్రజా ప్రయోజనాల కంటే కేవలం కేసుల చుట్టూనే ప్రభుత్వాన్ని తిప్పుతున్నారని, కేసీఆర్ గారు సాగునీటి ప్రాజెక్టులపై అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రజల దృష్టి మళ్లించడానికి నోటీసుల డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, రైతు బంధు వంటి హామీల అమలుపై ప్రజలు నిలదీస్తారనే భయంతోనే ముఖ్యమంత్రి ఇదంతా

...:: మిగతా 2లో



తోలు తీస్తాం అంటే.. చూస్తూ ఊరుకోం

- అసెంబ్లీ అంటే కేసీఆర్‌కు భయమెందుకు
- బీఆర్ఎస్ నేతలకు ప్రజలచే బుద్ధి చెప్పిస్తాం
- కేసీఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ డిప్యూటీ సీఎం భట్టి
- పాత పినపాకలో సబ్ స్టేషన్ల పనులకు శంకుస్థాపన

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 23: ప్రజలకు పనికొచ్చే సంక్షేమ పథకాలు చేపడుతున్నాం కాబట్టే ప్రజలు కాంగ్రెస్ బలపరిచిన 85% మందిని సర్పంచులు గా గెలిపించి పంపిస్తే, తోలువలుస్తా అని కేసీఆర్ మాట్లాడుతున్నారని, తోలు వలుస్తామంటే చూస్తూ ఊరుకోమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు కేసీఆర్‌వ్యాఖ్యలపై మండిపడ్డారు. మాకు దిగజారి మాట్లాడడం రాదని, చేతల ద్వారా ప్రజా సంక్షేమ కార్యక్రమాల ద్వారా బీఆర్ఎస్ నేతలకు

...:: మిగతా 2లో



బంగ్లా మూకదాడిపై వీహెచ్‌పీ నిరసన

దేశ రాజధాని ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ వద్ద మంగళవారంనాడు తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. హిందువులపై దాడులను ఖండిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్దఎత్తున బంగ్లా హైకమిషన్ కార్యాలయానికి చేరుకున్నారు.

7



వాజ్‌పేయి జీవితం స్ఫూర్తిదాయకం

- యువతకు ఆయన ఆదర్శం
- శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధన కోసం కృషి
- రాజనీతి, దౌత్య నీతి ప్రదర్శించే వ్యక్తి మోదీ
- మాజీ ఉపరాష్ట్ర పతి వెంకయ్యనాయుడు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 23: మాజీ ప్రధాని, దివంగత నాయకుడు, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయ్ జీవితం తెరిచిన పుస్తకం అని, ప్రతి పేజీ స్ఫూర్తి దాయకం అని భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధన కోసం వాజ్‌పేయ్ నిరంతరం కృషి చేశారని చెప్పారు. కేంద్ర సాంస్కృతిక శాఖ, త్రినేత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణ గూడ కేశవ్ మెమోరియల్ కళాశాలలో భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, ఇతర నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీకి బలమైన పునాది వేసిన వ్యక్తుల్లో వాజ్‌పేయి ముందు వరుసలో ఉంటారని కీర్తించారు. వాజ్‌పేయిని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ శిష్యుడిగా ఎంచుకున్నారని చెప్పారు. వాజ్‌పేయి పాలన అంటే సుపరిపాలన అని, యువతకు వాజ్‌పేయ్ ఆదర్శం అని అన్నారు. తాను పదవి విరమణ మాత్రమే చేశానని, పెదవి విరమణ చేయలేదన్నారు. వాజ్‌పేయి చూపిన మార్గంలో నడుస్తున్నామా? లేదా? అనేది ప్రతీ కార్యకర్త ఆలోచించుకోవాలని సూచించారు. నైతిక పాలన, సామాజిక బాధ్యత, రాజ్యాంగం పట్ల అంకిత భావంతో పని చేయాలని దిశానిర్దేశం చేశారు. రాజ్యాంగం పుస్తకాన్ని పట్టుకుని తిరిగితే

...:: మిగతా 2లో



ఆదాయానికి మించి ఆస్తులు..

- మహబూబ్‌నగర్‌డీటీసీ అరెస్టు
- రూ.200 కోట్లు కూడబెట్టినట్లు అంచనా
- మహబూబ్‌నగర్ ఆర్టీఏ కార్యాలయంలో ఏసీబీ సోదాలు
- హైదరాబాద్‌లోని ఆయన ఇంటిలోనూ సోదాలు
- కీలక పత్రాలు సాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 23: ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన మహబూబ్‌నగర్‌డీటీసీ కిషన్ నాయక్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్టు చేశారు. డీటీసీ కిషన్ నాయక్ భారీగా

...:: మిగతా 2లో

ట్యాపింగ్‌కేసులో అరెస్టుకు భయపడేది లేదు

- సిట్‌ఓ పెద్ద జోక్.. అక్రమ కేసులు పెట్టారు
- అధికారులు తప్పించుకోలేరు
- అసెంబ్లీలో చర్చకు సిద్ధం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు మండిపాటు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 23: అసెంబ్లీ ముగిసిన తర్వాత తనకు ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసులు ఇస్తారనే ప్రచారం జరుగుతోందని, ఈ ఎస్ఐటీ ఒక పెద్ద జోక్ అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. పోలీసులు అక్రమ కేసులు పెడితే వారి పేర్లు నమోదు చేసుకుంటున్నామని, రిటైర్ అయినా, విదేశాల్లో ఉన్నా బాధ్యత నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. ఉద్యమ కాలంలో తనపై 300 కేసులు ఉన్నాయని, బెదిరింపులకు భయపడేది లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, రాజకీయ కక్ష సాధింపు చర్యలపై నేత హరీశ్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ప్రెస్‌మీట్ అనంతరం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా డిఫెన్స్‌లోకి వెళ్లిందని ఆయన అన్నారు. తన 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ముఖ్యమంత్రి రాత్రి 9.30 గంటలకు మీడియా చిట్ చాట్ పెట్టి వివరణ ఇచ్చుకోవడం ఇదే మొదటిసారని వ్యాఖ్యానించారు. అందాల పోటీలు, ఫుట్ బాల్ షోలు, గ్లోబల్ సమ్మిట్‌లు పేదలకు ఉపాధి, అన్నం ఇస్తాయా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డికి సచివాలయానికి వెళ్లడమే భయంగా మారిందని, వాస్తు భయంతో మెట్లు కూడా ఎక్కడం లేదని ఆరోపించారు. గేట్లు, తలుపులు మార్చినా భయం పోలేదని, కేవలం కమాండ్ కంట్రోల్ రూమ్‌కే పరిమితమయ్యారని

...:: మిగతా 2లో



అసోంలో చెలరేగిన హింస

అల్లరి మూకలు గువాహటికి 190 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖెరోనీలో షాపులను, వాహనాలను దగ్ధం చేయడమే కాక, పోలీసులపై రాళ్లు, బాంబులు, బాణాలతో దాడులు చేశారు.

7

రాష్ట్రీయం

ఒక్క ఎకరాకూ నీళ్లు ఇవ్వలేదు

మొదటిపేజీ తరువాయి

అడగలేదని ఆరోపించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలను ఘోరంగా మోసం చేశారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఇరిగేషన్‌కు రూ.1.83 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరాకు కూడా కొత్తగా నీరు ఇవ్వలేదని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించిన ప్రాజెక్టుల ద్వారానే నీటి పంపిణీ జరిగిందన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పేరుతో ఏపీ నీటి దోపిడీకి కేసీఆర్ సహకరించారని ఉత్తమ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పనులను నిలిపివేశామని తెలిపారు. వచ్చే మూడేళ్లలో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వంలో పాలమూరు ప్రాజెక్టుకు ఖర్చు చేసిన రూ.7 వేల కోట్ల వివరాలను లెక్కలతో సహా వెల్లడిస్తామని చెప్పారు. హరీష్‌రావు కమిషన్ల గురించి మాట్లాడుతున్నారని, అలాంటి అలవాట్లు తమకు లేవని స్పష్టం చేశారు. కేసీఆర్ కుటుంబం ఏదో అద్భుతాలు చేసినట్లు వ్యాఖ్యలు చేస్తోందని విమర్శించారు. అసెంబ్లీ నిబంధనల ప్రకారమే నడుస్తుందని, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు అవకాశం ఇచ్చి ఆంధ్రా వారికి కాంట్రాక్టులు ఇచ్చామని చెబుతారా? అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు.

తోలు తీస్తాం అంటే.. చూస్తూ ఊరుకోం

మొదటిపేజీ తరువాయి

బుద్ధి చెప్పిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం తల్లాడ మండలం పాత పినపాక గ్రామంలో పలు సబ్ స్టేషన్ ల పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో డిప్యూటీ సీఎం ప్రసంగించారు. రెండు సంవత్సరాల పాటు ఫామ్ హౌస్ లో పడుకొని నిన్న, మొన్న ఒక పెద్దాయన మీడియా సమావేశంలో మాట్లాడుతున్నారు అంటే ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ కార్యక్రమాలు చక్కగా జరుగుతున్నాయి మంచిగా చేయండి అని ఆశీర్వదిస్తారని భావించాం కానీ ఆయన తోలు తీస్తాం అంటూ మాట్లాడటం సరైంది కాదు అన్నారు. తోలు తీస్తాం అని కేసీఆర్ అంటున్నారు ఆయన తోలు వలిచే ఉద్యోగం ఎప్పుడు తీసుకున్నారో అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రతిపక్ష నాయకుడిగా రెండు సంవత్సరాల్లో ఒక్కరోజు కూడా కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. అసెంబ్లీ అంటే కేసీఆర్ కు ఎందుకంత భయం అన్నారు. అసెంబ్లీకి రాని ఆయనకు అసలు ప్రధాన ప్రతిపక్ష నాయకుని హోదా అవసరం లేదా? ఆయనకు ఆ హోదా అవసరమా? అని డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. తాము ప్రతిపక్షంలో ఉన్న పది సంవత్సరాలు ప్రధాన ప్రతిపక్ష నాయకునిగా తాను ఏ ఒక్కరోజు అసెంబ్లీకి గైర్హాజరు కాలేదు, ప్రతిరోజు ప్రజల సమస్యలపై అసెంబ్లీలో గళం విడిపించామని డిప్యూటీ సీఎం అన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న వారిని తోలు వలుస్తాం అంటే చూస్తూ ఊరుకోం, ఇక్కడ ఖాళీగా ఎవరూ లేరు అని డిప్యూటీ సీఎం ఘాటుగా బదులు ఇచ్చారు. తెలంగాణ రైజింగ్ అవుతుంది, రాష్ట్రానికి దేశవ్యాప్తంగా నాయకులు, బడా పారిశ్రామికవేత్తలు తరలివస్తున్నారు రాష్ట్ర ప్రభుత్వాన్ని పొగుడుతున్నారు. ఈ సమయంలో తాము ఎక్కడ కనిపించకుండా పోతామని ఆందోళనతో రెండు సంవత్సరాల తర్వాత బయటకు వచ్చి రాష్ట్ర ప్రభుత్వం పై విషయం కక్కి తిరిగి ఫామ్ హౌస్ లో పడుకోవడానికి వెళ్లారు మీకు ప్రజలే బుద్ధి చెబుతారని డిప్యూటీ సీఎం అన్నారు. రాష్ట్రంలోని 94 శాసనసభ నియోజకవర్గాల్లో పంచాయతీ ఎన్నికలు జరిగితే 85 శాసనసభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలుపొందారని ఈ మధ్యకాలంలో ఏ రాజకీయ పార్టీకి ఇంత పెద్ద ఎత్తున ప్రజల ఆశీర్వాదం లభించలేదని అన్నారు. ప్రజల మధ్య నిలబడి ప్రజల కోసం ఇందిరమ్మ రాజ్యం నిర్ణయాలు చేయడంతోనే సర్పంచి ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో గెలుపొందారని డిప్యూటీ సీఎం తెలిపారు.

అరెస్టుకు భయపడేది లేదు

మొదటిపేజీ తరువాయి

వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 4 వేల మందికి పైగా బీఆర్ఎస్ మద్దతుదారులు సర్పంచులుగా గెలవడంతో కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుందని హరీశ్‌రావు అన్నారు. అందుకే కోఆపరేటివ్ ఎన్నికలు నిర్వహించకుండా నామినేషన్ల ద్వారా కాంగ్రెస్ కార్యకర్తలను నియమించాలని చూస్తున్నారని విమర్శించారు. దమ్ముంటే ఎన్నికలు నిర్వహించాలని సవాల్ విసిరారు.

సాగునీటిపై ప్రభుత్వ పీపీటీకి స్వాగతం పలుకుతున్నాం

ఓయూకు ఒంటరిగా వస్తానని ప్రకటించిన సీఎం వేలాది మంది పోలీసుల భద్రతతో వెళ్లారని, విద్యార్థి నాయకులను అరెస్టు చేయించడమే ఇందుకు నిదర్శనమని ఆరోపించారు. సాగునీటి అంశంపై ప్రభుత్వం ఇచ్చే పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు స్వాగతం పలుకుతున్నామని, అయితే వాస్తవాలు చెప్పేందుకు బీఆర్ఎస్‌కూ అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇతర పార్టీలకంటే తమకు తక్కువ సమయం కేటాయించి మైకులు కట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఒక కన్సల్టెన్సీ కంపెనీలా పనిచేస్తోందని, బొంబాయి బ్రోకర్ల సలహాలతో పాలన సాగుతోందని ఆరోపించారు. గతంలో అప్పులు ఇప్పించినందుకు ఒక బ్రోకర్ కంపెనీకి రూ.180 కోట్ల కమిషన్ ఇచ్చారని, ఇప్పుడు అదే సలహాలతో జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేసి రూ.30 వేల కోట్ల అప్పు తెచ్చే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో కృష్ణా జలాల వినియోగం కేవలం 28.49 శాతమేనని, తెలంగాణకు 45 టీఎంసీలు చాలని ఉత్తమ్‌రెడ్డి లేఖ రాయడం చారిత్రక తప్పిదమని విమర్శించారు. వెంటనే 90 టీఎంసీల కోసం కొత్తగా లేఖ రాయాలని డిమాండ్ చేశారు.

2సిట్ ఒక పెద్ద జోక్...

ప్రభుత్వం ఇబ్బందుల్లో పడిన ప్రతీసారి ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ రేస్ అంశాలతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని అన్నారు. అసెంబ్లీ ముగిసిన తర్వాత తనకు ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసులు ఇస్తారనే ప్రచారం జరుగుతోందని, ఈ ఎస్ఐటీ ఒక పెద్ద జోక్ అని వ్యాఖ్యానించారు. పోలీసులు అక్రమ కేసులు పెడితే వారి పేర్లు నమోదు చేసుకుంటున్నామని, రిటైర్ అయినా, విదేశాల్లో ఉన్నా బాధ్యత నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. ఉద్యమ కాలంలో తనపై 300 కేసులు ఉన్నాయని, బెదిరింపులకు భయపడేది లేదన్నారు. సంగారెడ్డి జిల్లా సర్జాపూర్‌లో దళితులపై దాడులు జరిగినా కేసులు నమోదు చేయడం లేదని ఆరోపించారు. ఖాకీ చట్టం అందరికీ సమానంగా ఉండాలని అన్నారు. కానిస్టేబుళ్ల ఆరోగ్య భద్రతను లక్ష రూపాయలకు తగ్గించడం అన్యాయమని, వారి టీఏ, డీఏలపై దృష్టి పెట్టాలని డీజీపీని కోరారు. ఖమ్మం వరద బాధితులను పరామర్శించడానికి వెళ్లినప్పుడు దాడులు చేశారని, ఎన్ని కేసులు పెట్టినా రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీ సమావేశాలను కనీసం 15 రోజులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం కోసం త్యాగాలు చేసిన చరిత్ర తమదని, రేవంత్‌రెడ్డి అక్రమ కేసులు, కుట్రలకు భయపడే ప్రసక్తే లేదని హరీశ్‌రావు తేల్చి చెప్పారు.



జాగృతి కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 23: తెలంగాణ జాగృతి కార్యాలయంలో మంగళవారం క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర మెథడిస్ట్ బిషప్ ఎ. సిమియోన్, బాల వ్యాకరణ రచయిత పరవస్తు చిన్నయ సూరి మనవడు, అంతర్జాతీయ వక్త, పాస్టర్ రెవరెండ్ అరుణ్ పర్వతాలు, సంఘ కార్యకర్తలు, సభ్యులు, పాఠశాల విద్యార్థులతో కలిసి హాజరయ్యారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈ కార్యక్రమంలో పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాల వ్యాకరణ రచయిత పరవస్తు చిన్నయ సూరి మనవడు, అంతర్జాతీయ వక్త, పాస్టర్ రెవరెండ్ అరుణ్ పర్వతాలు మాట్లాడుతూ జీసస్ వలె తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రేమ పూర్వకంగా తెలంగాణ ప్రజలతో మమేకమవుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా బిషప్ సిమియోన్, కల్వకుంట్ల కవితతో కలిసి క్రిస్మస్ కేక్ ను కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు సంతులుగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పండుగను ఆహ్లాదంగా జరుపుకున్నారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో ప్రతి సంవత్సరం నిర్వహించే క్రిస్మస్ వేడుకలు, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచి సమాజంలోని వివిధ వర్గాలను ఒకే వేదికపై తీసుకువస్తున్నాయి.



కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పార్ట్ టైమ్ పొలిటీషియన్. ఎన్నికలప్పుడు ఆయన బిహార్ వచ్చారు. ఆ తర్వాత దేశం విడిచి వెళ్లారు. దేశంలో ఉంటే ఎన్నికల కమిషన్‌ను నిందిస్తారు. సుప్రీంకోర్టును విమర్శిస్తారు. రానున్న ఎన్నికల్లో బెంగాల్, కేరళ ఓటర్లు కూడా రాహుల్‌కు శిక్ష విధిస్తారు.
- బీజేపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నితిన్ నబీన్

అట్టడుగు వర్గాల వారికి నాణ్యమైన విద్య, వైద్యం అందాలి

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- వనపర్తి లో అధికారులు, వివిధ రంగాల ప్రముఖులతో ముఖాముఖి



ప్రతిపక్షం, వనపర్తి, డిసెంబర్23 : సమాజంలో అట్టడుగు వర్గాల వారికి నాణ్యమైన విద్య, వైద్యం అందాలని, బలమైన సమాజాన్ని నిర్మించినప్పుడే బలమైన దేశం తయారవుతుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ప్రధానమంత్రి కలలు కంటున్న వికసిత్ భారత్ లక్ష్యం సాధించాలంటే గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ విద్య, వైద్యం, ఆర్థికంగా సాధికారత సాధించాలన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా అధికారులు, వివిధ రంగాల ప్రముఖులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వనపర్తి జిల్లా పర్యటనకు విచ్చేసిన తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య సాదర స్వాగతం పలికారు. కలెక్టరేట్ ఆవరణలో పోలీసు గౌరవ వందనం స్వీకరించిన గవర్నర్, ఆ వెంటనే వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అక్కడే ఏర్పాటు చేసిన స్టాల్స్, విద్యార్థుల యొక్క సాంస్కృతిక నృత్య ప్రదర్శనలను తిలకించారు. సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాల వారికి నాణ్యమైన విద్య, వైద్యం అందేలా కృషిచేయాలని సూచించారు. బలమైన సమాజాన్ని నిర్మించినప్పుడే బలమైన దేశం తయారవుతుందని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధిలో కవులు, కళాకారులు, రచయితలు, వివిధ రంగాల ప్రముఖులు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అప్పుడే సమాజం పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకుంటుందని తెలిపారు. క్షయరహిత సమాజాన్ని నిర్మించాలన్నా, బాల్యవివాహాలను నిర్మూలించాలన్నా కవులు, కళాకారులు, రచయితల గళం ఎంతో కీలకమన్నారు. వీరంతా సమాజంలో భాగస్వాములై తమ గళాన్ని వినిపించాలని ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలియజేశారు. ప్రత్యక్షంగా పరస్పర మానవ సంబంధాలతోనే సమాజంలో సాధికారత సాధ్యమవుతుందని తెలియజేశారు. వనపర్తి జిల్లాలో క్షయ రహిత సమాజాన్ని నిర్మించడం కోసం జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అదేవిధంగా జిల్లాలో ప్రతి ఒక్కరికి హెల్త్ ప్రొఫైల్ ఉండాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం హెల్త్ యాప్ ని సృష్టించడం చాలా అద్భుతమని గవర్నర్ కొనియాడారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ జిల్లా ప్రొఫైల్ తో పాటు, జిల్లాలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్ కు వివరించారు. జిల్లాలో విద్య, వైద్యం, మహిళా సంక్షేమం కోసం అమలు చేస్తున్న అనేక కార్యక్రమాల గురించి గవర్నర్ కు వివరించారు. క్షయ రహిత జిల్లా గా తీర్చిదిదేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన చర్యలను వివరించారు. అదేవిధంగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మిషన్ మధుమేహ, మిషన్ మధుమేహ దృష్టి కార్యక్రమాలను వాటి లక్ష్యాలను వివరించారు. పీఎం శ్రీ పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న కార్యక్రమాలు, అన్ని పాఠశాలల్లో వంట కోసం చేపట్టిన గ్యాస్ సిలిండర్ కనెక్షన్స్ కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు. జిల్లాకు చెందిన వివిధ రంగాల ప్రముఖులు ఏ. దినకర్ బాబు విశ్రాంత ఐఏఎస్, పద్య కవి ఆకుల శివరాజ లింగం, పద్య కవి సందాపురం బిచ్చయ్య, కూచిపూడి నృత్యకారిణి వంగిపురం నీరజాదేవి, విశ్వ మానవతా సంస్థ శ్రీనివాస అల్లూరి, ప్రభుత్వ ప్రధానోపాధ్యాయురాలు పెరవల్లి గాయత్రి, శిల్పి బైరోజు చంద్రశేఖర్, సెపక్తక్రా అంతర్జాతీయ క్రీడాకారిని రాళ్ల నవత, బాక్సింగ్ క్రీడాకారుడు నున్సావత్ వెంకటేష్, పోచ రవీందర్ రెడ్డి, చిత్రకారుడు గడ్డం శివకుమార్, జానపద కళాకారుడు రాజారాం ప్రకాష్ తమ పరిచయాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు మల్లు రవి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, గవర్నర్ స్పెషల్ సెక్రటరీ భవాని శంకర్, ఎస్.పి.డి. సునీత లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నదీ జలాలపై సీఎంకు అవగాహన లేదు

మొదటిపేజీ తరువాయి

చేస్తున్నారని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రికి నదీ జలాలపై అవగాహన లేదు

కృష్ణా నదీ జలాల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం, రాష్ట్ర మంత్రుల అజ్ఞానంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నల్లగొండ జిల్లా వేదికగా సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ ఆయన ప్రభుత్వ తీరును ఎండగట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి నదీ జలాల అంశం పైన ఎలాంటి అవగాహన లేదని కేటీఆర్ అన్నారు. నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులపై కేటీఆర్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా సాగునీటి శాఖ మంత్రికి నీళ్లపై కనీస అవగాహన లేదని, ఇటీవల జరిగిన ఒక మీడియా సమావేశంలో నీళ్ల గురించి అడిగిన ప్రశ్నలకు "నేను ప్రిపేర్ అయి రాలేదు, రేపు వచ్చి సమాధానం చెప్తాను" అని తప్పించుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. మరో మంత్రిని ఉద్దేశించి "వాటర్ లో నీళ్లు" అని మాట్లాడే అజ్ఞాని అంటూ ఎద్దేవా చేశారు. ప్రజల కష్టాలు, సాగునీటి అవసరాలు తెలియని వారు అడ్డదారిలో అధికారంలోకి వచ్చి హుంకరిస్తున్నారని, అబద్ధాలు చెప్పి గందరగోళం సృష్టించడం తప్ప వీరికి ప్రజల పట్ల చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు.

పాలమూరు వంటి కీలక ప్రాజెక్టులను అశ్రద్ధ చేస్తున్నారు

కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కుల కోసం కేసీఆర్ గారు గర్జిస్తుంటే, దానికి సమాధానం చెప్పే దమ్ము ఈ ప్రభుత్వానికి లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. పాలమూరు,రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వంటి కీలక ప్రాజెక్టులను ఈ ప్రభుత్వం అశ్రద్ధ చేస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వం 90 శాతం పనులు పూర్తి చేస్తే, మిగిలిన 10 శాతం పనులను కూడా పూర్తి చేయలేక ఈ రెండేళ్లుగా కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. డీపీఆర్ పంపడంలో విఫలమవడమే కాకుండా, ప్రాజెక్టుల పరిధిని కుదిస్తూ తెలంగాణ ప్రయోజనాలకు గండికొడుతున్నారని విమర్శించారు. నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల రైతాంగానికి కృష్ణా జలాల్లో న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని కేటీఆర్ ప్రకటించారు. సాగునీటి అంశంపై కేసీఆర్ గారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వం తడబడుతోందని, ప్రజల దృష్టిని మళ్లించడానికి బెదిరింపులకు దిగుతోందని ఆరోపించారు. ఇలాంటి బెదిరింపులకు బీఆర్ఎస్ భయపడదని, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

కేసీఆర్ ప్రశ్నలకు సమాధానం లేదు

సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కేసీఆర్ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పే సత్తా ప్రభుత్వానికి లేదని కేటీఆర్ మండిపడ్డారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం 90 శాతం పూర్తి చేస్తే, మిగిలిన 10 శాతం పనులను ఈ ప్రభుత్వం అడ్డుకుంటోందని విమర్శించారు. "కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే కేసీఆర్ గారు గర్జిస్తున్నారు. దానికి సమాధానం చెప్పలేక, ప్రజల దృష్టిని మళ్లించడానికి కేసీఆర్ గారిపై నిరాధారమైన కేసుల లీకులు ఇస్తున్నారు" అని దుయ్యబట్టారు.

వాజ్‌పేయి జీవితం స్ఫూర్తిదాయకం

మొదటి పేజీ తరువాయి

అంకిత భావంతో పని చేసినట్లు కాదన్నారు. రాజకీయ నాయకులకు తప్పుడు భాష మాట్లాడటం అలవాటు అయిపోయిందంటూ ప్రస్తుత నాయకుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు వెంకయ్య నాయుడు. రాజకీయ నాయకులు శత్రువులు కాదని.. కేవలం ప్రత్యర్థులు మాత్రమేనని చెప్పారు. భారత్‌ను శక్తివంతమైన దేశంగా ప్రపంచం ముందు నిలబెట్టిన వ్యక్తి వాజ్ పేయ్ అని చెప్పారు. రాజనీతి, దౌత్య నీతి ప్రదర్శించే వ్యక్తి మోదీ అంటూ ప్రధానిపై వెంకయ్యనాయుడు ప్రశంసలు కురిపించారు. ఆపరేషన్ సిందూర్ ను విజయవంతం చేసిన ఆర్మీ, శాస్త్రవేత్తలకు హ్యాట్సాఫ్ చెప్పారు

ఆదాయానికి మించి..

మొదటి పేజీ తరువాయి

ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులుగుర్తించారు. బహిరంగ మార్కెట్లో సుమారు రూ.200 కోట్ల వరకు ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్‌లో కిషన్ స్వగృహం సహా మహబూబ్‌నగర్ ఆర్టీఓ కార్యాలయంలో సోదాలు చేపట్టి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. బుధవారం ఉదయ 5 గంటల నుంచి అవినీతి నిరోధక శాఖ అధికారులు హైదరాబాద్‌లోని ఆయన స్వగృహం సహా మహబూబ్‌నగర్ ఆర్టీఓ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు జరిపారు. కిషన్ ఇల్లు, బంధువుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించిన అధికారులు రూ.12 కోట్లకు పైగా విలువైన ఆస్తులకు సంబంధించిన ధ్రువపత్రాలు, డాక్యుమెంట్స్, బంగారం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు ఏసీబీ డీఎస్పీ శ్రీధర్. హైదరాబాద్, నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాల్లో అక్రమ ఆస్తులను గుర్తించినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఆరు చోట్ల, నిజామాబాద్‌లో మూడు చోట్ల, నారాయణఖేడ్‌లో మూడు చోట్ల సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. ఏసీబీ అధికారులు. నారాయణఖేడ్‌లో 30 ఎకరాలు, నిజామాబాద్‌లో 10 ఎకరాల భూమికి సంబంధించి అక్రమ ఆస్తులను గుర్తించినట్లు వెల్లడించారు. పాట్ మార్కెట్‌లోని అజిత్ గోల్డ్ దుకాణంలో కిషన్ నాయక్ పేరిట ఉన్న బంగారాన్ని తీసుకువచ్చి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒక కిలో బంగారంతో పాటు, నిజామాబాద్‌లో లహరి అంతర్జాతీయ హోటల్, అపార్ట్‌మెంట్లకు సంబంధించిన పత్రాలను గుర్తించామన్నారు. డాక్యుమెంట్ విలువ ప్రకారం రూ.12 కోట్ల పైగా అక్రమ ఆస్తులు గుర్తించామని తెలిపారు

జవాబుదారి తనంతో పని చేయండి

మొదటి పేజీ తరువాయి

వివరించారు. అధికారుల సహకారం ఉండాలని, అధికారులు జవాబుదారీ తనంతో పనిచేయాలని ఆదేశించారు. ఐఏఎస్ అధికారులు ప్రతి పది రోజులకోసారి క్షేత్రస్థాయికి వెళ్లాలని, నెలలో కనీసం మూడు సార్లు తమ శాఖ పరిధిలో ఏం జరుగుతుందో క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని సీఎం ఆదేశించారు. ప్రతి నెలా సీఎస్‌కు అధికారులు తమ పని తీరుపై నివేదికలు సమర్పించాలంటూ స్పష్టం చేశారు. ప్రతి నెల సీఎస్ తమ శాఖలపై సీఎస్ సమీక్షిస్తారని, మూడు మాసాలకోమారు స్వయంగా తానే సమీక్షిస్తానని సీఎం అధికారులకు వివరించారు.

అందుకే పాలసీలు అమలు చేశాం

'ఈ రెండేళ్లలో కొన్ని విజయాలు సాధించాం, కొన్ని ప్రణాళికలు రూపొందించుకున్నాం. గతంలో ఎనర్జీ, ఎడ్యుకేషన్, ఇరిగేషన్, హెల్త్ లాంటి వివిధ శాఖలకు సంబంధించి ఒక పాలసీ లేకపోవడంతో కొన్ని సమస్యలు వచ్చాయి. అందుకే ముఖ్యమైన విభాగాల్లో పాలసీలు అమలు చేశాం..' అని సీఎం అన్నారు. అందుకే ముఖ్యమైన విభాగాలకు ఒక పాలసీని తీసుకున్నామని తెలిపారు. రాష్ట్రానికి ఒక పాలసీ ఉండాలని తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ను విడుదల చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే రాష్ట్రాన్ని మూడు విభాలుగా విభజించి అభివృద్ధికి బాటలు వేసుకున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందు నిలిపేందుకు ప్రజాప్రభుత్వం పనిచేస్తున్నదని, అధికారులుప్రభుత్వానికి పూర్తి సహకారం అందించాలన్నారు. ఇకపై ప్రతి అధికారి ప్రభుత్వం తీసుకొస్తున్న పాలసీలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. శాఖల ఉన్నతాధికారులు సమన్వయంతో పనిచేయాల్సిందేనని, ఇందుకోసం ఒక మెకానిజం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శాఖల అధికారుల మధ్య సమన్వయం లోపించిందని, దీంతో ప్రభుత్వ ప్రాధాన్యతలు ముందుకుసాగడంలేదని సీఎం ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ఇక ముందు ఇలాంటివి రాకుండా ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పనిచేయాల్సిందే నని హెచ్చరికలు జారీ చేశారు.

ఉద్యోగుల వివరాలివ్వండి..

ప్రతీ కార్యదర్శి శాఖల్లో పనిచేస్తున్న రెగ్యులర్, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంబంధించి పూర్తి వివరాలు అందజేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ఆ వివరాలు జనవరి 26 లోగా సీఎస్ కు అందించాలని అధికారులకు సూచించారు. అలాగే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందాల్సిన జీతాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం అందుతున్నాయో లేదో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పరిశీలించాలని సీఎం సూచించారు. ఈ ప్రక్రియను జనవరి 26 లోగా పూర్తి చేయాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండకూడదని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఉన్న 113 మున్సిపల్ ఆఫీసులకు సొంత భవనాలున్నాయా.. ఎక్కడెక్కడ అద్దె భవనాలున్నాయో వెంటనే గుర్తించి నివేదిక అందించాలన్నారు. ప్రజలకు సేవలందించే ఆఫీసులు పట్టణాల్లో అందరికీ అందుబాటులో ఉండేలా కొత్త భవనాలు నిర్మించాలని ఆదేశించారు. ఇతర విభాగాలు, శాఖలకు చెందిన భవనాలుంటే వాటిని వినియోగించుకోవాలని, లేదంటే ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించి వెంటనే నిర్మాణాలకు అంచనాలు రూపొందించాలని సీఎం చెప్పారు. మున్సిపల్ ఆఫీసులతో పాటు అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ హాస్టళ్లు, అంగన్వాడీలు అన్నింటికీ సొంత భవనాలు ఉండేలా వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. అందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందని చెప్పారు.

సీఎస్ఎస్ నిధులను సద్వినియోగం చేసుకోవాలి

కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల (సీఎస్ఎస్) నుంచి వచ్చే నిధులను అన్ని శాఖలు సద్వినియోగం చేసుకోవాలని సీఎం చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు వాటాగా చెల్లిస్తే, కేంద్రం దాదాపు 60 శాతం ఈ పథకాలకు నిధులు ఇస్తుంది. ఈ పథకాలతో దాదాపు రూ.3 వేల కోట్లు తెచ్చుకునే వీలుందని, అందుకు వీలుగా అన్ని శాఖలు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని, కేంద్ర ప్రభుత్వ విభాగాలతో సంప్రదింపులు జరపాలని సీఎం ఆదేశించారు. సీఎస్ఎస్ నుంచి వచ్చే నిధులకు అవసరమైన రాష్ట్ర వాటాను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన అనుమతులు, వివిధ విభాగాలకు సంబంధించి కేంద్రం వద్ద పెండింగ్లో ఉన్న అంశాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో అందుబాటులో ఉంచాలని, వాటి పురోగతిని ప్రతి వారం సమీక్షించుకోవాలని సీఎం ఆదేశించారు. అన్ని ప్రభుత్వ శాఖలు జనవరి 31లోగా ఈ ఫైలింగ్ సిస్టమ్ అమలు చేయాలని సీఎం గడువు నిర్ణయించారు. కాగితాలు, ఫైళ్లు పట్టుకొని తిరిగే పరిస్థితి ఉండకుండా అన్ని ఆన్లైన్లోనే జరగాలని సీఎం ఆదేశించారు. కోర్ అర్బన్ ఏరియాలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సీఎం అధికారులకు సూచించారు. కార్పొరేట్ తరహాలో సర్కారు స్కూళ్లలో నమోదు శాతం పెంచేందుకు రవాణా సదుపాయం, బ్రేక్ ఫాస్ట్, మిడ్ డే మీల్స్ అమలు దిశగా ప్రణాళికలుండాలని సూచించారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా..

రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలన్నింటా టీచింగ్ హాస్పిటల్స్లు అద్భుతమైన వైద్యసేవలందించేలా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. నిమ్స్ తరహాలో సనత్నగర్, కొత్తపేట, అల్వాల్ టిమ్స్, వరంగల్ హాస్పిటళ్లు, ఉస్మానియా కొత్త ఆసుపత్రి ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా అన్ని వసతులతో తీర్చిదిద్దాలని సీఎం చెప్పారు. మెడికల్ కాలేజీ హాస్పిటళ్లను కూడా ఆరోగ్య శ్రీ, సీఎంఆర్ఎఫ్ అనుసంధానం చేయాలని సూచించారు. అక్కడ సేవలందించే వైద్యులకు, సిబ్బందికి కూడా సర్జరీలు, ప్రత్యేక సేవలకు ఇన్సెంటివ్లు ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో సీఎం రామకృష్ణారావుతో స్పెషల్ సీఎస్లు, సీఎంవో అధికారులు, అన్ని శాఖల ప్రిన్సిపల్ సెక్రెటరీలు, సెక్రెటరీలు పాల్గొన్నారు.

సింగరేణి ఇక గ్లోబల్‌గా ఎదగాలి

- ప్రపంచవ్యాప్తంగా సింగరేణి జెండా ఎగరాలి
- రాష్ట్రంలోని బొగ్గు బ్లాకులన్నీ దక్కించుకునేందుకు ప్రణాళిక
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- సత్తుపల్లిలో సింగరేణి జీఎం కార్యాలయం ప్రారంభం



ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్: 136 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణి గ్లోబల్ గా ఎదగాలని, సింగరేణి జెండా ప్రపంచవ్యాప్తంగా ఎగిరేలా చేసేందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం ఆయన సత్తుపల్లిలో సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం బొగ్గు ఉత్పత్తికి పరిమితం అయితే సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని, అందుకే బొగ్గు బావులకే పరిమితం కాకుండా రేర్ ఎర్త్ మినరల్స్, క్రిటికల్ మినరల్స్ కు సంబంధించిన బ్లాకుల వేలంలో పాల్గొని ఆ బ్లాకులను సాధించాలని ఆలోచనలో సింగరేణి యాజమాన్యం ఉందని తెలిపారు. కేవలం విద్యుత్తు ఉత్పత్తి కే పరిమితం కాకుండా గ్రీన్ ఎనర్జీ లో భాగంగా సోలార్, హైడల్, బ్యాటరీ, పంపుడు స్టోరేజ్, హైడ్రోజన్ వంటి విభాగాల్లో విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. బొగ్గు బావులతోనే సంతృప్తి చెందకుండా లిథియం, గ్రాఫైట్, కాపర్ వాటన్నిటికీ పోటీపడి ఆ బ్లాకులను సైతం సాధించాలని ఆలోచనలో సింగరేణి సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తుందని డిప్యూటీ సీఎం తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలో గోల్డ్, కాపర్ గనుల తవ్వకాల్లో టెండర్లు దక్కించుకొని సింగరేణి భాగస్వామిగా మారిందని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని బొగ్గు బ్లాకులు సింగరేణి దక్కించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రచించిందని, ఇతర రాష్ట్రాల్లోనూ బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొని టెండర్లు దక్కించుకుంటామని డిప్యూటీ సిఎం తెలిపారు. సింగరేణి ఆధ్వర్యంలో జైపూర్ లో పెద్ద ఎత్తున థర్మల్ పవర్ ను తీస్తున్నామని , 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్తులో రాజస్థాన్ ప్రభుత్వం భాగస్వామి అయ్యే దశకు సింగరిని ఎదిగిందని తెలిపారు. గ్రీన్ ఎనర్జీ లో సైతం సింగరేణి ముందుకు వెళుతుందని ఇప్పటికే ఫ్లోటింగ్ సోలార్ ఎనర్జీని సింగరేణి ఉత్పత్తి చేస్తుంది అన్నారు. 1500 మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తి కోసం రాజస్థాన్ ప్రభుత్వంతో సింగరేణి జాయింట్ వెంచర్ లో పాల్గొంటుందని డిప్యూటీ సీఎం వివరించారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా థర్మల్ ,సోలార్, ఫ్లోటింగ్, పంపుడు స్టోరేజ్, రీర్ ఎర్త్ మినరల్స్, క్రిటికల్ మినరల్స్ ఇలా బహుముఖంగా విస్తరించేందుకు సింగరేణి ముందుకు వెళుతుందని డిప్యూటీ సీఎం అన్నారు. 136 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకుని 137 వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న చారిత్రాత్మక సింగరేణి సంస్థ విజయోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు.

ఐదు జిల్లాలలో యూరియా యాప్ అమలు

- యాప్ పనితీరు పట్ల రైతుల సంతృప్తి
- గత రెండు రోజుల్లో యాప్ ద్వారా 60,510 బస్తాలు కొనుగోలు
- త్వరలో అన్ని జిల్లాలలో అమలుకు సన్నాహాలు
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్23: వ్యవసాయశాఖ ద్వారా ప్రవేశపెట్టిన యూరియా యాప్ 5 జిల్లాలలో ప్రయోగాత్మకంగా గత రెండ్రోజుల నుండి పరిశీలించడం జరిగిందని, 5 జిల్లాలలో దాదాపు లక్ష మందికి పైగా డౌన్ లోడ్ చేసుకోవడం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో 897, జనగామ జిల్లాలో 5150, మహబూబ్ నగర్ 3741, నల్లగొండ 3618 మరియు పెద్దపల్లి జిల్లాలోని 6289 మొత్తం 19695 మంది రైతులు ఈ యాప్ ద్వారా యూరియాను తమ సమీప డీలర్ దగ్గర 60,510 యూరియా బస్తాలు బుక్ చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. అంతేకాకుండా 217 మంది కౌలు రైతులు కూడా 678 యూరియా బస్తాలు ఈ యాప్ ద్వారా బుక్ చేసుకోవడం జరిగిందని, మొదటి రోజు అక్కడక్కడ తలెత్తిన సాంకేతిక సమస్యలను కూడా వెంటనే పరిష్కరించడం జరిగిందని తెలిపారు. రైతులు కూడా ఈ యాప్ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని, వారికి వారి ఊరిలో ఏ డీలర్ దగ్గర ఎంత స్టాక్ ఉందో తెలుస్తుందని, తద్వారా వారు బుక్ చేసుకొని, వారికి నచ్చిన సమయంలో షాప్ వద్దకు వెళ్లి ఒటిపి చూపించి కొనుగోలు చేసారని తెలిపారు. ఈ రెండు రోజుల్లో యాప్ విజయవంతం కావడంతో, ఈ యాప్ ను మరికొన్ని రోజులు పరిశీలించి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడానికి సిద్ధం కావాల్సిందిగా అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. ఈ రోజు రైతునేస్తం కార్యక్రమంలో కూడా రైతులకు యాప్ పై గల సందేహాలను నివృత్తి చేయడం జరిగిందని తెలిపారు. ఈ రబీ సీజన్ కు గాను రాష్ట్రానికి ఇప్పటికే 5.30 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావడం జరిగిందని, యూరియా వినియోగం అధికంగా ఉండే జనవరి, ఫిబ్రవరి నెలలకు గాను సరిపడ యూరియాను ముందస్తుగానే తెప్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.



ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దండి

- కొత్త సర్పంచులకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 23: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించి, ప్రమాణ స్వీకారం చేసిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులను ఉద్దేశించి ఆయన మంగళవారం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఒక సందేశాన్ని విడుదల చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపించిన ప్రజాప్రతినిధులు, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని సీఎం సూచించారు. "మంచి పాలన అందించి, మీ పంచాయతీలను ఆదర్శవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దాలి" అని సీఎం ఆకాంక్షించారు. అవినీతికి తావు లేకుండా, పారదర్శకమైన పాలనను ప్రజలకు చేరువ చేయాలని, తద్వారా ప్రజల మన్ననలు పొందాలని ఆయన కొత్త పాలకవర్గాలకు దిశానిర్దేశం చేశారు.

కేసీఆర్‌ది అబద్ధపు ప్రచారం

- కృష్ణా జలాలు, పాలమూరు– రంగారెడ్డిపై సెంటిమెంట్ రాజకీయం
- ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు
- కేసీఆర్ తీరుపై మండిపాటు



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్23 కృష్ణా జలాలు, పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ అంశాలపై భారతీయ జనతా పార్టీ, కేంద్ర ప్రభుత్వంపై మాజీ సీఎం కేసీఆర్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా తప్పుడువని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ అబద్ధపు ప్రచారాలతో కేంద్ర ప్రభుత్వాన్ని "శని, దరిద్రం" అంటూ అవమానిస్తున్నారని తీవ్రంగా ఖండించారు. మరో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభావంతో డీపీఆర్‌ను కేంద్రం తిరస్కరించిందన్న వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని తెలిపారు. డీపీఆర్‌పై కేంద్రం అడిగిన ప్రశ్నలు కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడే మొదలయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా ఏమీ జరగలేదన్నారు. వాస్తవాలను ప్రజల ముందు పెట్టకుండా సెంటిమెంట్ రాజకీయం చేయడమే కేసీఆర్ లక్ష్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఎక్కడా అన్యాయం చేయలేదని, చేయదని స్పష్టం చేశారు. కొన్ని నెలల తర్వాత బయటకు వచ్చి కేసీఆర్ చేస్తున్న 'ఓటీపీ రాజకీయాలు' ఇక సాగవని అన్నారు.

బీజేపీ బలం పెరుగుతోంది

రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఓటుశాతం క్రమంగా పెరుగుతోందని, ప్రజల నుంచి అపూర్వమైన మన్ననలు లభిస్తున్నాయని తెలిపారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ రెండు స్థానాలు గెలుచుకుందని, ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సరైన అభ్యర్థులు కూడా దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఒకప్పుడు బీఆర్ఎస్‌కు 8 వేల మంది సర్పంచులు ఉండగా, ఇటీవల గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఆ సంఖ్య 2 వేలకే పడిపోయిందని, అదే సమయంలో బీజేపీ సర్పంచుల సంఖ్య 164 నుంచి వెయ్యికి పెరిగిందని పేర్కొన్నారు. ఇది బీజేపీ బలం ఎంత పెరిగిందో స్పష్టంగా చూపిస్తోందన్నారు. బీజేపీకి పెరుగుతున్న ప్రజాబలం చూసి భయపడి కేసీఆర్ మళ్లీ ప్రజలను మభ్యపెట్టేందుకు బయటకు వచ్చారని ఆరోపించారు. నీటి సమస్యపై బీజేపీ ప్రత్యేక స్టడీ టీమ్‌తో పాటు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రతి ఇరిగేషన్ ప్రాజెక్టును పరిశీలించి నష్టాలు, లోపాలపై సమగ్ర అధ్యయనం చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న కొత్త ప్రాజెక్టులు గానీ, పాత ప్రాజెక్టుల రీఅలైన్‌మెంట్ గానీ రైతులకు నిజంగా ప్రయోజనం కలిగించాయా లేదా అన్నది ప్రజలే ఆలోచించాలని ఎన్. రాంచందర్‌రావు అన్నారు



గ్రామాన్ని దశల వారీగా అభివృద్ధి చేస్తా

- నాగిరెడ్డిగూడ సర్పంచ్ పద్మ సంజీవరెడ్డి

ప్రతిపక్షం, మొయినాబాద్ , డిసెంబర్ 23 : గ్రామాన్ని దశల వారీగా అభివృద్ధి చేస్తానని నాగిరెడ్డిగూడ గ్రామ సర్పంచ్ పద్మ సంజీవరెడ్డి అన్నారు.మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ గ్రామంలో సర్పంచ్ పద్మ సంజీవ రెడ్డి పదవ వార్డులో అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిచేసి సుందరవనంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, మౌలిక వసతుల కల్పనకు పిద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. దశల వారీగా అన్ని వార్డులను అభివృద్ధిచేస్తానని తెలిపారు. గ్రామాన్ని అభివృద్ధిచేసి జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా నాగిరెడ్డిగూడను తీర్చిదిద్దుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చేసుకున్న ఒప్పందం.. తెలంగాణకు మరణశాసనం

- 299 టీఎంసీల అగ్రిమెంటు వెనుక మతలబు ఎంటో?
- మహారాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వెదిరే శ్రీరామ్



హైదరాబాద్, డిసెంబర్ 23: కృష్ణా నీటి పంపకాల విషయంలో నాడు కేసీఆర్ చేసుకున్న 299 టీఎంసీల అగ్రిమెంటే తెలంగాణకు మరణ శాసనంగా మారిందని కేంద్ర జలశక్తి మాజీ సలహాదారు, మహారాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వెదిరే శ్రీరామ్ అన్నారు. కృష్ణా జలాలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై వెదిరె శ్రీరామ్ స్పందించారు. కృష్ణా నదీ జలాల పంపకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గతంలో అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో 811 టీఎంసీలల కేసీఆర్ 299 టీఎంసీలకు మాత్రమే అగ్రిమెంట్ చేసుకున్నారని శ్రీరామ్ గుర్తు చేశారు. 299 టీఎంసీ లకు అగ్రిమెంట్ చేసుకోవడం వెనక ఉన్న ప్రయోజనాలు ఏంటో కేసీఆర్‌కే తెలియాలన్నారు. నాడు కేసీఆర్ చేసుకున్న 299 టీఎంసీల అగ్రిమెంట్.. నేడు తెలంగాణకు మరణ శాసనంగా మారిందన్నారు. కేసీఆర్ విధనాలే కృష్ణా వాటర్‌లో పాలమూరుకు అన్యాయం జరగడానికి కారణమయ్యాయని చెప్పారు. కృష్ణా నీటి పంపకాలపై కేసీఆర్ చేసుకున్న ఒప్పందం తెలంగాణకు పెను శాపంగా మారిందని శ్రీరామ్ ఆరోపించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును దృష్టిలో పెట్టుకొని 299 టీఎంసీల నీటికి కేసీఆర్ అగ్రిమెంట్ చేసుకున్నారా? అని శ్రీరామ్ ప్రశ్నించారు. పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్ట్ ప్లానింగ్ ఉన్నప్పుడు.. కేసీఆర్ నాడు ఏ విధంగా 299 టీఎంసీలకు అగ్రిమెంట్ చేసుకున్నారని నిలదీశారు. 299 టీఎంసీల నీటిని తెచ్చుకున్నప్పటికీ పూర్తి స్థాయిలో వాటర్‌ను ఉపయోగించుకోవడంలో కేసీఆర్ విఫలం అయ్యారని విమర్శించారు. ఎన్నికల సమయంలో కేసీఆర్ హడావుడి చేయడం తప్పితే.. ఏ ఒక్క ఎకరానికి కూడా నీరు చేరలేదని శ్రీరామ్ విమర్శించారు. 1050 టీఎంసీల నీటిని ఫ్లైస్‌గా రెండు తెలుగు రాష్ట్రాలకు నీటిని కేటాయింపు చేయాలని కేంద్రప్రభుత్వం నూతనంగా ట్రిబ్యునల్ వేసిందని.. రెండు రాష్ట్రాల నీటి కేటాయింపులపై కొత్తగా ట్రిబ్యునల్ వేయడం కేంద్ర ప్రభుత్వ గొప్పతనం అని పేర్కొన్నారు. ఆ ట్రిబ్యునల్‌లో ప్రణాళికబద్ధంగా అడ్వకెట్లను పెట్టుకొని వాదించుకుంటే 650 టీఎంసీలకు పైగా తెలంగాణకు నీటి వాటా వచ్చే అవకాశం ఉందని శ్రీరాం స్పష్టం చేశారు.



కవులు, కళాకారులు

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- జోగులాంబ ఆలయాలు చారిత్రకంగా, ఆధ్యాత్మికంగాప్రాచుర్యం


ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్23: జిల్లా అభివృద్ధిలో కవులు, కళాకారులు భాగస్వామ్యం కావాలని గవర్నర్‌జిష్ణుదేశ్‌వర్మ సూచించారు. మంగళవారం అలంపూర్ జోగులమ్మ అమ్మవారిని గవర్నర్ దర్శించుకున్నారు. గవర్నర్‌కు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఐడీఓసీ సమావేశ హాల్ నందు జిల్లా అధికారులు, వివిధ రంగాల ప్రముఖులతో సమావేశవయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రగవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ అలంపూర్ శ్రీ జోగులాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలు చారిత్రకంగా, ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన క్షేత్రమని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వికసిత భారత్ జాతీయ స్లోగన్ గా పేర్కొంటూ ప్రజలందరూ దేశాభివృద్ధికి పాటుపడాలని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్' దిశగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రాజ్ భవన్‌ను ప్రజలకు దగ్గరగా ఉండాలనే ఉద్దేశంతో 'లోక్ భవన్'గా పేరు మార్చినట్లు గవర్నర్ తెలిపారు. విద్య అత్యంత ముఖ్యమైన అంశమని పేర్కొంటూ, విద్యా రంగంలో గుణాత్మక అభివృద్ధి సాధించి, జిల్లాలో ఉత్తమ స్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని గవర్నర్ పేర్కొన్నారు. టీబీ ముక్త భారత్ కార్యక్రమంను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తదాన శిబిరాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారని, భవిష్యత్తులో వాటిని ఇంకా మెరుగ్గా నిర్వహించి మరింత ఎక్కువగా రక్తదాన కార్యక్రమాలు చేపట్టాలని గవర్నర్ సూచించారు.

సోయాబీన్ రైతులకు న్యాయం చేయాలి

- కేంద్రానికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో వానాకాలం (ఖరీఫ్) 2025-26 సీజన్‌లో కురిసిన అకాల, దీర్ఘకాలిక భారీ వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన సోయాబీన్ రైతులను ఆదుకోవాలని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు మంత్రి తుమ్మల ప్రత్యేకంగా రాసిన లేఖల్లో తెలంగాణ రైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణలో సోయాబీన్ ఒక ప్రధాన ఖరీఫ్ పంటగా ఉన్నదని, ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గిరిజన రైతులు పెద్ద ఎత్తున ఈ పంటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని మంత్రి తుమ్మల తన లేఖలో తెలిపారు. 2025-26 సీజన్‌లో సుమారు 3.66 లక్షల ఎకరాల్లో సోయాబీన్ సాగు జరగగా, దాదాపు 2.79 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా ఉందన్నారు. అయితే, కోత దశలో కురిసిన భారీ వర్షాల వల్ల సోయాబీన్ పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని, దీంతో పెద్ద మొత్తంలో పంట ఎఫ్ఏక్యూ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేకుండా మారిందని వివరించారు. ఆదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి, సంగారెడ్డి వంటి జిల్లాల్లో ప్రధానంగా గిరిజన రైతులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో సుమారు 36 వేల మెట్రిక్ టన్నుల వర్షనష్టం చెందిన సోయాబీన్‌ను ధర మద్దతు పథకం కింద కొనుగోలు చేసేందుకు అనుమతించాలని కేంద్రాన్ని కోరారు.



లోపాలున్న జీవో 252ను సవరించాలి

- రిపోర్టర్లకు ఒకలా, డెస్క్ జర్నలిస్టులకు మరోలా కార్డులు సరికాదు
- అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రెడిటేషన్ కార్డు ఇవ్వాలి
- సమాచార శాఖ డైరెక్టర్, అడిషనల్ డైరెక్టర్ కు హెచ్ యూజే, టీడబ్ల్యూజేఎఫ్ వినతి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 23: జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జీవో 252లో అనేక లోపాలున్నాయని, వెంటనే వాటిని సవరించి జర్నలిస్టులకు న్యాయం చేయాలని హెచ్ యూజే, టీడబ్ల్యూజేఎఫ్ సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. మంగళవారం సమాచార శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, అడిషనల్ డైరెక్టర్ జగన్ ను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. కొత్తగా అక్రిడిటేషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, ఇందుకు సీఎం రేవంత్ రెడ్డికి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. అయితే జీవోలో ఉన్న కొన్ని నిబంధనలు జర్నలిస్టులను గందరగోళానికి గురిచేసేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 252లో జర్నలిస్టులను రెండు వర్గాలుగా విభజిస్తూ పాలసీ నిర్ణయం జరిగిందనీ, ఇది సరికాదని ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు. రిపోర్టర్లకు అక్రిడిటేషన్ అని, డెస్క్ జర్నలిస్టులకు మీడియా కార్డు అని పేర్లు పెట్టి విభజించడం వల్ల డెస్క్ లో పనిచేసే వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికే కేంద్రం తీరుతో రైల్వే పాసులు పోయాయని, ఆర్టీసీ రాయితీ కూడా తగ్గించారని గుర్తు చేశారు. ఇప్పుడు మీడియా కార్డు పేరుతో డెస్క్ జర్నలిస్టులకు బస్ పాస్ సౌకర్యం బంద్ అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు ఇవ్వాల్సిందేనని హెచ్‌యూజే, టీడబ్ల్యూజేఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. స్పందించిన అడిషనల్ డైరెక్టర్ జగన్ మీడియా కార్డులకు, అక్రిడిటేషన్ కార్డులకు ఒకే రకమైన సౌకర్యాలు ఉంటాయని చెప్పారు. డెస్క్ జర్నలిస్టులకు బస్ పాస్ ఉండదనేది అసత్య ప్రచారమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అడ్ హక్ కమిటీ కన్వీనర్ పిల్లి రాంచందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రాజశేఖర్, గుడిగ రఘు, హెచ్‌యూజే కార్యదర్శి జగదీశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, ఉపాధ్యక్షులు దామోదర్, డెస్కు జర్నలిస్టులు ఉపేందర్, మస్తాన్, సురేష్, కిరణ్, నరేష్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు ఇవ్వాలి..

జర్నలిస్టులకు పెండింగ్ లో ఉన్న ఇండ్ల స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించాలని హెచ్ యూజే, టీడబ్ల్యూజేఎఫ్‌నేతలు కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్నట్లుగానే జర్నలిస్టులకు కూడా ఆరోగ్య విధానాన్ని (హెల్త్ స్కీమ్) అమలు చేయాలన్నారు. రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, మహిళా జర్నలిస్టులకు రాత్రి పూట రవాణా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని హెచ్ యూజే, టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



ఆర్టీసీలో ప్రవేశపెట్టే బస్సులు, 'పల్లెవెలుగు' అయినా సరే ఎలక్ట్రికల్ ఏసీవే ఉండాలి. వచ్చే ఏడాది కొనే 1,450 బస్సులూ ఈవీనే తీసుకోవాలి. 8,819 డీజిల్ బస్సుల స్థానంలో ఈవీలనే పెట్టండి. 8 ఏళ్ల కాలపరిమితి దాటిన వాటినీ మార్చాలి. తిరుమల- తిరుపతి మధ్య రవాణాకు 300 ఈ-బస్సులు ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించింది. బస్సుల మెయింటెనెన్సును ప్రైవేటుకు అప్పగించా.

- అధికారులతో ఏపీ సీఎం చంద్రబాబు

ఓపెన్ వాయిస్

సేవ్ ఆరావళి

కేంద్రం ఇచ్చిన సిఫార్సులను సుప్రీంకోర్టు ఆమోదించిన తరువాత 'సేవ్ అరావళి' ప్రచారం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. కేంద్రం నిర్ణయం, సుప్రీంకోర్టు తీర్పు పర్యావరణ వేత్తలను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ క్రమంలో తాజాగా నిర్ణయాలు.. ఆరావళికి డెత్ వారెంట్ అంటూ కొందరు పేర్కొంటున్నారు. అయితే, కేంద్రం ఏం నిర్ణయం తీసుకుంది.. సుప్రీంకోర్టు ఏమని ఆమోదించింది.. ఆరావళికి వచ్చే ముప్పు ఏమిటి.. సేవ్ ఆరావళి ప్రచారం సోషల్ మీడియాలో ఎందుకు ట్రెండ్ అవుతోంది.. ఢిల్లీ చుట్టూ ఉన్న ఆరావళి పర్వతాల దగ్గర మైనింగ్ కి అనుమతి ఇవ్వడంతో ప్రారంభమైన రగడ తీవ్రస్థాయికి చేరింది. కంపెనీల లాభం కోసమే ఇలా ఆరావళి పర్వతాల నిర్వచనమే మార్చేశారని ప్రతిపక్షాలు నేతలు, పర్యావరణవేత్తలు ఆందోళనకి దిగారు. కేంద్రం మాత్రం 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న వాటిని పర్వతాలు అనరని.. అసలు ఆరావళి జోలికి తాము వెళ్లడం లేదని వాదిస్తోంది. దీంతో రాజకీయ రగడకి తోడు.. పర్యావరణ కోణంలోనూ ఆందోళనలకి తావిస్తోంది. మన దేశంలో అత్యంత పురాతనమైన పర్వతశ్రేణి ఆరావళి. ఇది 250 కోట్ల ఏళ్ల క్రితం నాటివని చెప్తారు. గుజరాత్ నుంచి రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ వరకు ఈ పర్వతాలు విస్తరించగా.. అసలు ఇతర ప్రాంతాల నుంచి ఢిల్లీకి ఇసుక తుఫాన్లు.. ధూళి వగైరా రాకుండా పెట్టని కోటలా కాపాడుతున్నాయంటారు. అసలు ఎడారులు థార్ నుంచి ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా అడ్డుపడింది కూడా ఈ పర్వతాలే. ఈ పర్వతాలలో అరుదైన ఖనిజాలు ఉన్నాయి. ప్రపంచంలో ఏ పర్వతాల్లోనైనా అరుదైన జీవ జాతులు నిక్షేపాలు ఉంటాయ్. వాటి కోసం అన్వేషణలో భాగంగా ఈ సంపద అంతా నాశనం చేస్తున్నారు.ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం 100 మీటర్ల కంటే ఎత్తు తక్కువ ఉన్న ఏ కొండలనైనా మైనింగ్ చేసుకోవచ్చంటూ.. మౌంటైన్.. అంటే పర్వతాలకు కొత్త నిర్వచనం ఇచ్చింది. దీంతో మైనింగ్ కంపెనీలకు ఆరావళిలో దారి దొరికినట్లైంది. దీనిపైనే పీపుల్ ఫర్ ఆరావళీస్ అనే స్వచ్ఛంద సంస్థ ఆందోళనకి దిగింది.ఇప్పటికే అక్రమ తవ్వకాలు, అభివృద్ధి పేరిట సాగుతున్న కట్టడాలతో హరియానా, రాజస్థాన్‌లోని చార్ఖీ దాద్రి, భీవానీ జిల్లాల్లో ఆరావళి పర్వతాలు ధ్వంసమయ్యాయి. జీవ వైవిధ్యం నాశనమైంది. పరిస్థితి మరింత దిగజారితే ఉత్తర భారతంలో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. ఆరావళిలో గనుల తవ్వకాలను సుప్రీంకోర్టు గతంలో నిషేధించినా, అక్రమ కార్యకలాపాలు మాత్రం ఆగలేదు. ఇప్పుడు పర్వతాలకు కొత్త నిర్వచనం ఇవ్వడంతో ఆరావళిలోని 90 శాతం ప్రాంతాలకు మైనింగ్ ముప్పు పొంచి ఉంది. అదే జరిగితే, ఢిల్లీ వరకు థార్ ఎడారి విస్తరించే ప్రమాదముంది. గాలి నాణ్యత మరింత దెబ్బతింటుంది. అనారోగ్య సమస్యలు పెరిగిపోతాయని 'పీపుల్ ఫర్ ఆరావళీస్' హెచ్చరిస్తోంది.ఈ ఏడాది జూన్ 5న స్వయంగా మోదీనే ఆరావళి గ్రీన్ ప్రాజెక్ట్ ప్రారంభించగా.. ఇప్పుడిలా అసలు పర్వతాలంటే ఏంటంటూ కొత్త డెఫినిషన్ ఇవ్వడమే విమర్శలకు తావిస్తోంది. కొత్త నిబంధనలతో 90 శాతం పర్వతాలు సురక్షితంగా ఉంచుతామని భరోసా ఇస్తూ.. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులు, మార్గదర్శకాలకు అనుగుణంగానే పర్వత ప్రాంతాల రక్షణ జరుగుతోందని ప్రకటించింది. ఆరావళి ప్రాంతంలో అక్రమ మైనింగ్‌ను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వాలతో కలసి పని చేస్తామంటోంది కేంద్రం.భారత దేశంలో పురాతనమైన ఆరావళి పర్వత శ్రేణి గుజరాత్ నుంచి రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ వరకు సుమారు 700 కిలోమీటర్ల పొడవున పర్వత శ్రేణి విస్తరించి ఉంది. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా 2024లో ఒక విషయం చెప్పింది. ఆరావళిలోని తక్కువ ఎత్తు ఉండే పర్వతాలు.. థార్ ఎడారి నుంచి వచ్చే ధూళి, ఇసుకను అడ్డుకోవడంలో సహజ కవచంగా పనిచేస్తోందని తెలిపింది. ఇది ఢిల్లీ - ఎన్సీఆర్ ప్రాంతంతో సహా బహుళ రాష్ట్రాలకు భూగర్భ జల రీఛార్జ్, గొప్ప జీవవైవిధ్యాన్ని నిలబెట్టేందుకు సహాయపడుతుంది. కొంతకాలంగా ఆరావళి పర్వతాలపై ఖనిజాలకోసం తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అందువల్ల క్రమంగా కొండలు తరిగిపోతున్నాయి. పర్యావరణం దారితప్పుతోంది.. ఈ పర్వతాలు తరిగిపోతూ ఉంటే చలిగాలులు ముందుగానే ఇండియాలోకి వచ్చేస్తాయి. అయితే, కేంద్ర ప్రభుత్వం ఈ పర్వతాల్లో 100 మీటర్ల కంటే (328 అడుగులు) తక్కువ ఎత్తు ఉన్న ప్రాంతాల్లో మైనింగ్ జరుపుకోవచ్చునని అనుమతి ఇచ్చింది. కేంద్రం తీరుపై పర్యావరణ వేత్తల నుంచి, పలు పార్టీల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి 100మీటర్లలోపు ఉన్న వాటిని ఆరావళి పర్వతాలుగా చెప్పలేమని, పర్వతం అనేది 100 మీటర్ల కంటే ఎత్తే ఉంటుందనీ,.. అందువల్ల తాము పర్మిషన్ ఇచ్చింది పర్వతాల్ని తొలిచేందుకు కాదని కేంద్రం పేర్కొంది. స్థానిక భూభాగాల నుండి కనీసం 100 మీటర్ల ఎత్తులో ఉన్న కొండలు లేదా ఒకదానికొకటి 500 మీటర్ల లోపు ఉన్నటువంటి కొండల సమూహాలు మాత్రమే ఇప్పుడు ఆరావళి శ్రేణిలో భాగంగా గుర్తించబడతాయని కేంద్రం పర్యావరణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. సుప్రీంకోర్టు నిర్ణయం తరువాత పురాతన పర్వత వ్యవస్థల్లో ఒకటైన ఆరావళి కొండలు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. సుప్రీం తీరుపై పర్యావరణ వేత్తలు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో 'సేవ్ ఆరవళి' హ్యాష్‌ట్యాగ్‌తో ఆరావళిని రక్షించాలని సోషల్ మీడియా వేదికగా నిపుణులు, పర్యావరణ కార్యకర్తలు పిలుపునిస్తున్నారు.

ప్రతిపక్షం
హైదరాబాద్,
బుధవారం
24.12.2025

మతం పేరుతో మారణహోమం
దేవుని పేరుతో రాజకీయం

'అల్లాహుఅక్బర్' అంటూ హింసకు పాల్పడినా, 'జైశ్రీరామ్' అంటూ హింసకు తెగబడినా దానికి కారణం మతం కాదు; మతాన్ని వక్రీకరించి, దాన్ని తమ స్వార్థానికి వాడుకునే మనుషులే కారణం. దేవుడి పేరు పలకడం వల్ల హంతకుడు భక్తుడైపోడు. మతం మనిషిని సంస్కరించాలి గానీ, అతడిని మృగంగా మార్చకూడదు. నిజం ఏమిటంటే, మతం ఎప్పుడూ హింసకు మూలం కాదు. హింసకు మూలం మనిషిలోని ద్వేషం, అసహనం, అధికార కాంక్ష. మతం ఆ ద్వేషానికి ఒక ముసుగు మాత్రమే. దేవుడి పేరు చెప్పుకొని మనిషిని చంపడం ద్వారా ఎవడూ భక్తుడవ్వడు. నోట్లో నినాదం, చేతిలో ఆయుధం ఉంటే అది ధర్మం కాదు; అది మానవత్వానికి విరుద్ధమైన నేరం.



ఎండీ ఉస్మాన్ ఖాన్
99125 80645

కాలం ఎంత ఆధునికమవుతున్నా, మనిషి మనసులోని మృగత్వం మాత్రం తగ్గడం లేదు. ఇటీవల బంగ్లాదేశ్‌లో ఒక వ్యక్తిని దారుణంగా హత్య చేసి, చెట్టుకు వేలాడదీసి నిప్పంటించిన సంఘటన మనమందరం చూశాం. ఆ హింస జరుగుతున్న వేళ కొందరు ముష్కరులు 'అల్లాహుఅక్బర్' అంటూ నినాదాలు చేయడం మరింత కలచివేసింది. మన దేశంలో కూడా 'జై శ్రీరామ్' అంటూ నినదిస్తూ, రాముని పేరుతో జరుపుతున్న హత్యలు, మూక దాడులు, మారణహోమాలు కూడా ఏ మాత్రం తక్కువకాదు. ఈ రెండు ఘటనలు/ దృశ్యాల మధ్య ఏమైనా తేడా ఉందా? లేదు. అక్కడా దేవుని పేరుతో దుర్మార్గమే, ఇక్కడా దేవుని పేరుతో దుర్మార్గమే. అసలు దైవ నామం హత్యలకు అనుమతి ఇస్తుందా? ఏ మతం అయినా హింసను ధర్మంగా బోధిస్తుందా? అన్న ప్రశ్నలు సహజంగానే ఉద్భవిస్తాయి. నిజం ఏమిటంటే, మతం ఎప్పుడూ హింసకు మూలం కాదు. హింసకు మూలం మనిషిలోని ద్వేషం, అసహనం, అధికార కాంక్ష. మతం ఆ ద్వేషానికి ఒక ముసుగు మాత్రమే. దేవుడి పేరు చెప్పుకొని మనిషిని చంపడం ద్వారా ఎవడూ భక్తుడవ్వడు. నోట్లో నినాదం, చేతిలో ఆయుధం ఉంటే అది ధర్మం కాదు; అది మానవత్వానికి విరుద్ధమైన నేరం. ఇస్లాం విషయానికి వస్తే, అత్యల్ప ప్రాణి అయిన చీమను కూడా అనవసరంగా చంపే అనుమతి లేదని ఇస్లాం స్పష్టంగా చెబుతుంది. ఖురాన్ మానవ ప్రాణాన్ని అత్యున్నత విలువగా గుర్తిస్తుంది. 'ఒక నిర్దోషిని చంపడం మొత్తం మానవజాతిని చంపినట్లే' అన్న భావన ఇస్లామీయ ధర్మబోధనల కేంద్రబిందువు. దైవ ప్రవక్త మహమ్మద్ (స) జీవితం మొత్తాన్ని పరిశీలిస్తే, ఆయన ఎప్పుడూ నిర్దోషులపై హింసను సమర్థించలేదు. యుద్ధ పరిస్థితుల్లో కూడా మహిళలు, పిల్లలు, వృద్ధులు, ధర్మ గురువులు, చెట్లు, పంట పొలాలు వేటికీ హానిచేయరాదని స్పష్టమైన ఆదేశాలున్నాయి. అలాంటి ధర్మం 'అల్లాహుఅక్బర్' అంటూ మారణహోమాన్ని సమర్థిస్తుందని చెప్పడం ఘోరమైన అపవాదే అవుతుంది. అదే విధంగా, శ్రీ రాముని పేరు భారతీయ సంస్కృతిలో కరుణ, ధర్మం, న్యాయం, త్యాగానికి ప్రతీక. రామరాజ్యం అంటే హింస కాదు; అది న్యాయపాలనకు, ప్రజాసంక్షేమానికి ప్రతిరూపం. అలాంటి రాముని పేరుతో జనాలను కొట్టి చంపడం, మూక దాడులకు పాల్పడడం, భయభ్రాంతులకు గురిచేయడం శ్రీరామ చంద్రునికే అత్యంత ఘోరమైన అవమానం. 'జైశ్రీరామ్' అన్న నినాదం ఎవరి ప్రాణాలు తీసే ఆయుధం కాదు; అది భక్తి వ్యక్తీకరణ మాత్రమే. దాన్ని హత్యలకు ఉపయోగించడం శ్రీరాముని బోధనలకు పూర్తిగా విరుద్ధం. ఇక్కడ స్పష్టంగా అర్థం చేసుకోవలసిన విషయం ఏమిటంటే, 'అల్లాహుఅక్బర్' అంటూ హింసకు పాల్పడినా, 'జైశ్రీరామ్' అంటూ హింసకు తెగబడినా దానికి కారణం మతం కాదు; మతాన్ని వక్రీకరించి, దాన్ని తమ స్వార్థానికి వాడుకునే మనుషులే కారణం. దేవుడి పేరు పలకడం వల్ల హంతకుడు భక్తుడైపోడు.



మతం మనిషిని సంస్కరించాలి గానీ, అతడిని మృగంగా మార్చకూడదు. ఈ సంఘటనను కొంతమంది దుర్మార్గులు సోషల్ మీడియా వేదికగా మతాలమధ్య, కులాల మధ్య చిచ్చు పెట్టే ఆయుధంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఒక దేశంలో జరిగిన నేరాన్ని, మరో దేశంలో ప్రతీకారానికి పిలుపుగా మార్చడం అత్యంత ప్రమాదకరమైన ధోరణి. ఇది బాధితుల పట్ల సానుభూతి కాదు; విద్వేషాన్ని వ్యాప్తి చేసే మానసిక రాజకీయ దౌర్బల్యం, దుష్ప్రచారం మాత్రమే. ఇక్కడ మరో అంశాన్ని కూడా విస్మరించలేం, బంగ్లాదేశ్‌లో జరిగిన ఈ ఘటన కేవలం మతపరమైనదేనా? లేక దాని వెనుక ఏమైనా రాజకీయ ప్రయోజనాలున్నాయా? అన్న ప్రశ్నకూడా తలెత్తుతోంది. చాలా దేశాల్లో పాలక రాజకీయ శక్తులు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, ప్రజల దృష్టిని మళ్లించేందుకు 'మైనారిటీల బూచి' ని చూపిస్తుంటాయి. మెజారిటీ సమాజంలో భయాన్ని రెచ్చగొట్టి, ఓటు బ్యాంకును పదిలం చేసుకోవడం అనేది పాత రాజకీయ తంత్రం. మత ఉద్రిక్తతలు పెరిగిన ప్రతీసారి, దాని లాభం సాధారణంగా అధికారంలో ఉన్నవారికే దక్కుతుంది; నష్టపోయేది మాత్రం సామాన్య ప్రజలే. ఈ కోణంలో చూస్తే, భారతదేశంలోనూ ఇలాంటి ధోరణులు కొత్తవి కావు. ఇక్కడ కూడా మైనారిటీలను బూచిగా చూపిస్తూ, మెజారిటీ ఓటర్లను గుండుగుత్తగా దండుకునే రాజకీయ ప్రయోగాలు జరగడం మనకు కొత్తేమీ కాదు. ప్రతి సంఘటన వెనుక నేరుగా పాలకులే ఉండకపోవచ్చు కానీ, మతపరమైన ఉద్రిక్తతల వల్ల రాజకీయంగా ఎవరికి లాభం చేకూరుతోందో జగమెరిగిన సత్యమే. అందుకే బంగ్లాదేశ్ ఘటన అయినా, భారత్‌లో జరిగే సంఘటనలైనా, వాటిని కేవలం 'మతాల మధ్య ఘర్షణ' గా చూడటం సరైన విధానంకాదు. మతం పేరుతో జరిగే ప్రతి హింస వెనుక మానవ ద్వేషంతో పాటు, చాలా సందర్భాల్లో రాజకీయ లెక్కలు కూడా పనిచేస్తాయి. ఈ నిజాన్ని గుర్తించకుండా ఒక మతాన్ని మొత్తం దోషిగా చిత్రీకరిస్తే, అది హింసోన్మాదుల వ్యూహానికి మనం సహకరించినట్లే అవుతుంది. ఇస్లాం అయినా, హిందూ ధర్మం అయినా, క్రైస్తవ మతం అయినా అన్నీ మానవీయ విలువలనే బోధిస్తాయి. కరుణ, క్షమ, న్యాయం, సహనం అన్నవే మతాల సారాంశం. వాటిని వదిలేసి ద్వేషాన్నే మతంగా మార్చుకుంటే, ఆ సమాజం శాంతిని కోల్పోతుంది. చివరికి మతం కాదు, మనిషే కనుమరుగవుతాడు. అందుకే ఈ సందర్భంలో మనం ఒక స్పష్టమైన నిర్ణయానికి రావాలి. మతం పేరుతో జరిగే ప్రతి హింసను అది ఏ మతానికి సంబంధించినదైనా నిర్ద్వందంగా ఖండించాలి. అల్లాహుఅక్బర్ అంటూ చంపినా అది ఇస్లాం కాదు. జైశ్రీరామ్ అంటూ చంపినా అది హిందూ ధర్మం కాదు. రెండూ ఒకే రకమైన మానవత్వ హత్యలే. మనుషులుగా, సమాజంగా మన బాధ్యత ఏమిటంటే, మతాన్ని ద్వేషానికి ఆయుధంగా మార్చేవారిని గుర్తించడం, ప్రశ్నించడం, తిరస్కరించడం. దేవుని పేరు మనిషిని హింసించేందుకు, చంపేందుకు కాదు; మనిషిని మనిషిగా గౌరవించేందుకు. అదే నిజమైన భక్తి. అదే నిజమైన ధర్మం.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు)

నవ సర్పంచ్! మీ గెలుపు ఒక బాధ్యత



కొండేటి ప్రకాష్
7981781086

గ్రామ పంచాయతీ ఎన్నికల కోలాహలం ముగిసింది. అమాంతంగా గ్రామాలన్నీ "ఎప్పుడెప్పుడు ఎన్నికలు వస్తాయా" అని ఎదురుచూసిన తరుణం గడిచిపోయింది. వాస్తవానికి, 42 శాతం రిజర్వేషన్ల అంశంపై నెలకొన్న సందిగ్ధత వల్ల ప్రభుత్వం కొన్ని నెలల పాటు ఎన్నికలను వాయిదా వేస్తూ వచ్చింది. కానీ, అనూహ్యంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ నగారా మోగించి, నోటిఫికేషన్ ఇచ్చి, మూడు విడతలుగా ఎన్నికల ప్రక్రియకు ముగింపు పలికింది. ఇప్పుడు కొత్త సర్పంచ్‌లు బాధ్యతలు చేపట్టారు. ఊరంతా పండగ వాతావరణం కనిపిస్తోంది. కానీ, గెలిచిన సర్పంచ్‌లకు ఇది కేవలం విజయోత్సవం మాత్రమే కాదు.. ఒక పెద్ద పరీక్షా కాలం ప్రారంభమైందని గుర్తించాలి. గెలిచిన సంతోషం కొద్దిరోజులే ఉంటుంది, కానీ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే మాత్రం ఐదేళ్ల పాటు నిరంతరం కష్టపడాలి. అయితే, ఈ విజయం వెనుక ఉన్న చేదు నిజాలను కూడా మనం విస్మరించలేం. ఎవరు అవునన్నా, కాదన్నా.. ఈ ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బు, మద్యం పంపిణీ జరిగింది. ఎన్నికల్లో ఓటమి పాలైన అభ్యర్థులు ఓటర్లను పిలిపించి దేవుళ్ల ఫొటోల మీద ప్రమాణాలు చేయించుకుంటున్న దృశ్యాలు టెలివిజన్ ఛానెళ్లలో మనం చూశాం. ఇవన్నీ ప్రజాస్వామ్యానికి కొంత కలత కలిగించే అంశాలే అయినప్పటికీ, ప్రజల మద్దతుతో విజయం సాధించిన సర్పంచ్‌లు ఇప్పుడు సమగ్ర గ్రామాభివృద్ధి కోసం ప్రత్యేకమైన వారుగా పేరు సంపాదించుకోవాలి. ఒక సామాన్య పౌరుడిగా, గ్రామాభివృద్ధిని కోరుకునే వ్యక్తిగా కొత్త సర్పంచ్‌లకు కొన్ని సూచనలు.

పగలు, ప్రతీకారాలకు స్వస్తి పలకండి

ఎన్నికల సమయంలో గ్రామాల్లో వర్గ పోరు సహజం. కానీ, గెలిచిన తర్వాత మీరు కేవలం మిమ్మల్ని గెలిపించిన వారికి మాత్రమే సర్పంచ్ కాదు.. ఓటు వేయని వారికి, మిమ్మల్ని వ్యతిరేకించిన వారికి కూడా మీరే సర్పంచ్. "వీడు మనకు ఓటు వేయలేదు, వీడి పని చేయొద్దు" అనే ధోరణి ఉంటే గ్రామం ఎప్పటికీ బాగుపడదు. కుల, మత భేదాలను గ్రామాల నుండి తరిమివేయడానికి మీరు కంకణబద్ధులు కావాలి. పాత గొడవలను పక్కన పెట్టి, అందరినీ కలుపుకొని పోయేవాడే నిజమైన నాయకుడు. ఆ పెద్దరికాన్ని మీరు ప్రదర్శించాలి.

ముందుగా మౌలిక అవసరాలపై దృష్టి

గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం మీరు ప్రత్యేకమైన ప్రణాళికలు రూపొందించుకోవాలి. గ్రామంలో పెద్ద పెద్ద ప్రాజెక్టుల కంటే, నిత్యం ప్రజలు పడే ఇబ్బందులపై దృష్టి పెట్టండి. వీధి దీపాలు వెలుగుతున్నాయా? డ్రైనేజీలు సక్రమంగా ఉన్నాయా? కుళాయిల్లో నీరు వస్తుందా? అనేవి చిన్న విషయాలుగా అనిపించవచ్చు కానీ, ఇవే సామాన్యుడికి ముఖ్యం. మురికి కాలువలు శుభ్రం చేయించడం, వీధుల్లో చెత్త పేరుకుపోకుండా చూడటం వంటి పనులు మీ పాలనపై ప్రజల్లో గౌరవాన్ని పెంచుతాయి. గ్రామ పరిశుభ్రత, ప్రజల ఆరోగ్యం విషయంలో ఎక్కడా రాజీ పడకూడదు.



పారదర్శకత - మన పంచాయతీ

గ్రామ పంచాయతీకి వచ్చే నిధులెంత? ఖర్చు పెడుతున్నదెంత? అనే విషయాలను సామాన్య ప్రజలకు కూడా తెలిసేలా ఉండాలి. గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యక్రమంలో ప్రజలు పాల్గొనే విధంగా వారిని ప్రోత్సహించండి. గ్రామసభలను తూతూమంత్రంగా కాకుండా, పక్కాగా నిర్వహించండి. ప్రజలకు వీలున్న సమయంలో నే సభలు నిర్వహించి, కనీసం మూడింతల మంది ప్రజలు పాల్గొనే విధంగా చర్యలు తీసుకోండి. ప్రతి పైసా ప్రజల సొమ్ము అనే స్పృహ ఉన్నప్పుడు, అవినీతికి తావుండదు. గ్రామంలో చేసే పనుల వివరాలను నోటీసు బోర్డులపై ఉంచడం ద్వారా ప్రజల్లో మీపై నమ్మకం పెరుగుతుంది.

విద్య, వైద్యం.. మన భవిష్యత్తు

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు ఎలా చదువుతున్నారో, అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం అందుతుందో లేదో వారానికోసారి వెళ్లి పర్యవేక్షించండి. ముఖ్యంగా, గ్రామీణ విద్యార్థుల కోసం ప్రభుత్వ బడుల్లో గ్రంథాలయాల స్థాపన (Libraries) చేసేలా అధికారులను సంప్రదించి చర్యలు తీసుకోండి. ఊరి ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉన్నాయా, డాక్టర్లు వస్తున్నారా అనేది చూసే బాధ్యత మీదే. గ్రామంలోని యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా, వారికి క్రీడల పట్ల ఆసక్తి కలిగించేలా చిన్న మైదానాన్ని అభివృద్ధి చేయడం వంటివి చేస్తే.. ఆ గ్రామం ఆరోగ్యకరంగా ఉంటుంది. సర్పంచ్ పదవి అనేది ఒక హోదా కాదు, అదొక సేవ చేసే అవకాశం. ఎన్నికల ఫలితాల రోజున మెడలో పడిన పూలదండలు కేవలం విజయోత్సవానికి చిహ్నాలు మాత్రమే కాదు, అవి ప్రజలు మీపై ఉంచిన నమ్మకానికి నిదర్శనాలు. రాజకీయ పార్టీలు మరియు నాయకులు గ్రామాభివృద్ధికి తోడ్పడాలే తప్ప ఆటంకం కాకూడదు. ఐదేళ్ల తర్వాత మీరు పదవి దిగిపోతున్నప్పుడు, "మా ఊరి సర్పంచ్ మంచి పనిచేసిండు" అని ప్రజలు చెప్పుకుంటే అదే మీరు సంపాదించుకున్న గొప్ప ఆస్తి. రాజకీయాలను తాత్కాలికంగా చూడండి, అభివృద్ధిని శాశ్వతంగా చూడండి. మన గ్రామాన్ని ఒక ఆదర్శ గ్రామంగా మార్చుకునే గొప్ప అవకాశం ఇప్పుడు మీ చేతుల్లో ఉంది. ఈ చారిత్రక అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, గ్రామ స్వరాజ్య స్థాపనలో మీరు విజేతలుగా, ప్రజా సేవకు పునరంకితం కావాలి.

ఆకలి కోరల్లో గాజా.. మౌనం వీడని ప్రపంచం!



ముహమ్మద్ ముజాహిద్
96406 22076

'ఆకలికి భాష లేదు.. కానీ అది పెట్టే కన్నీటి చారికలు ఇప్పుడు గాజా వీధుల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. బాంబుల మోత వినబడటం ఆగిపోయిన క్షణాల్లో కూడా, అక్కడ ఒక పసివాడి ఆకలి కేక నిశ్శబ్దాన్ని చీల్చుతోంది. చేతిలో ఖాళీ గిన్నె పట్టుకుని, ఎక్కడో ఒకచోట గంజి నీళ్లయినా దొరక్కపోవా అని ఆశగా చూస్తున్న ఆ అమాయక కళ్లు.. ఆధునిక ప్రపంచపు అంతరాత్మను ప్రశ్నిస్తున్నాయి. ఒకవైపు యుద్ధం ప్రాణాలను తీస్తుంటే, మరోవైపు ఆకలి ఆ ప్రాణాలను ఉంచి ఉంచి నరకాన్ని చూపిస్తోంది. లక్షలాది మంది జీవితాలు ఇప్పుడు కేవలం ఒక పూట ఆహారం కోసం, ఒక గుక్కెడు స్వచ్ఛమైన నీటి కోసం దిక్కుతోచని స్థితిలో ఎదురుచూస్తున్నాయి. ఇది కేవలం ఒక ప్రాంతపు సంక్షోభం కాదు, మానవత్వం ఎదుర్కొంటున్న అతిపెద్ద పరీక్ష." మానవ నాగరికత సిగ్గుతో తలదించుకోవాల్సిన భయానక దృశ్యం నేడు గాజాలో కనిపిస్తోంది. బాంబుల వర్షం కంటే ఇప్పుడు అక్కడ 'ఆకలి' అనే మౌన యుద్ధం అమాయక ప్రాణాలను బలితీసుకుంటోంది. ఐక్యరాజ్యసమితి తాజాగా విడుదల చేసిన నివేదిక గాజాలోని వినాశకర పరిస్థితులకు అద్దం పడుతోంది. కేవలం భూభాగం కోసం సాగుతున్న పోరులో లక్షలాది మంది సామాన్యులు, ముఖ్యంగా పసిపిల్లలు బలిపశువులు కావడం అత్యంత విచారకరం.

ఆకలి.. ఒక ఆయుధంగా?

యుద్ధం అంటే కేవలం ఆయుధాల మోత మాత్రమే కాదు, అది సామాన్యుడి కంచాన్ని కూడా దూరం చేస్తుందని గాజా నిరూపిస్తోంది. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం సుమారు 16 లక్షల మంది ప్రజలు ప్రస్తుతం పస్తులుంటున్నారు. యుద్ధ విమానాల మోత ఒకవైపు భయపెడుతుంటే, కడుపులో కరుస్తున్న ఆకలి మంటలు అంతకంటే తీవ్రంగా బాధిస్తున్నాయి. ఒక లక్షకు పైగా చిన్నారులు, వేలాది మంది గర్భిణీలు సరైన పోషకాహారం అందక చావుకు చేరువలో ఉండటం అంతర్జాతీయ సమాజం వైఫల్యానికి నిదర్శనం.

విచ్ఛిన్నమైన మౌలిక వ్యవస్థ

కేవలం ఆహారమే కాదు, జీవించడానికి అవసరమైన కనీస వనరులను కూడా యుద్ధం చిన్నాభిన్నం చేసింది. 79 శాతం కుటుంబాలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో లేదు. పారిశుధ్యం పడకేసింది. వ్యవసాయ రంగాన్ని, మార్కెట్ వ్యవస్థలను ధ్వంసం చేయడం ద్వారా ఒక జాతిని ఆర్థికంగా, శారీరకంగా బలహీనపరిచే కుట్ర అక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో, ఉన్న కొద్దిపాటి ఆహారాన్ని కొనడం కూడా సగటు పౌరుడికి అసాధ్యంగా మారింది.



అంతర్జాతీయ సంస్థల హెచ్చరిక

వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి గాజాలో పూర్తిస్థాయి 'క్షామం' సంభవించే ప్రమాదం ఉందని వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ మరియు యునిసెఫ్ వంటి సంస్థలు హెచ్చరిస్తున్నాయి. యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియని అనిశ్చితి మధ్య, మానవతా సాయం అందించడానికి కూడా అడ్డంకులు ఎదురవ్వడం ఆందోళనకరం. తాత్కాలిక శిబిరాల్లో తలదాచుకుంటున్న 7 లక్షల మందికి పైగా శరణార్థుల పరిస్థితి వర్ణనాతీతం. కేవలం ప్రకటనలతోనో, నివేదికలతోనో సరిపెట్టే సమయం దాటిపోయింది. యుద్ధం ఏదైనా, కారణం ఏదైనా సరే.. ఆకలితో అలమటించే పసిబిడ్డలకు ఏ సిద్ధాంతమూ ఆకలి తీర్చలేదు. ప్రపంచ దేశాలు తక్షణమే స్పందించి, రాజకీయ వైషమ్యాలను పక్కన పెట్టి మానవతా దృక్పథంతో గాజాకు సాయం అందించాలి. లేనిపక్షంలో, ఆధునిక చరిత్రలో ఒక అతిపెద్ద మానవ నిర్మిత విపత్తుకు సాక్ష్యంగా మిగిలిపోవాల్సి ఉంటుంది.

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
90102 23917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలి

- ఆ దిశగా అధికారులు కార్యాచరణ కొనసాగించాలి
- అభివృద్ధిని నిరంతరం పర్యవేక్షించాలి
- నర్వ యాస్పరేషన్ బ్లాక్ లో విస్తృతంగా పర్యటించిన కేంద్ర ప్రభారీ అధికారి స్వప్నాదేవి రెడ్డి



ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణ పేట్, డిసెంబర్ 23: ప్రజల జీవన ప్రమాణాలను పెంచే దిశగా అధికారులు కార్యచరణను కొనసాగించాలని కేంద్ర ప్రభారీ అధికారి, స్వచ్ఛభారత్ మిషన్ డైరెక్టర్ స్వప్నా దేవి రెడ్డి సూచించారు. నారాయణ పేట జిల్లాకు వచ్చిన ఆమె మంగళవారం జిల్లాలోని నర్వ యాస్పరేషన్ (బ్లాక్) మండలంలోని పెద్ద కడుమూరు, నర్వ, రాయికోడ్ గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాల్లో వసతులు, వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, మహిళల అభ్యున్నతికి చేపడుతున్న కార్యక్రమాలను పర్యవేక్షించారు. ముందుగా పెద్ద కడుమూరు గ్రామానికి చేరుకున్న కేంద్ర ప్రభారీ అధికారి అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించి కేంద్రంలో పిల్లల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. అంగన్ వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సరస్వతీ మాత విగ్రహానికి పూజలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అక్కడే గ్రామానికి చెందిన గర్భిణీలకు చీర,గాజులు, పసుపు కుంకుమ పెట్టీ శ్రీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్న ప్రాసన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్వ మండలం యాస్పరేషన్ బ్లాక్ కింద 2023 లో ఎంపికైన తర్వాత అభివృద్ధి చెందింది అన్నారు. కానీ ఇంకా చాలా అభివృద్ధి చెందాలని, యాస్పిరేషన్ బ్లాక్ స్టేట్ ర్యాంకింగ్ లో మూడో స్థానం నుంచి మొదటి స్థానం చేరుకోవాలని ఆకాంక్షించారు. అయితే అందుకు ప్రజల సంపూర్ణ సహకారం అవసరం అని అన్నారు. గ్రామంలో వైద్య పరీక్షలు చేస్తున్నారా ?. మీ పిల్లలందరూ చదువుకుంటున్నారా ? ప్రతీ ఇంటికి తాగునీరు సరఫరా అవుతుందా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత పక్కనే ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లి విద్యార్థుల సంఖ్య, పాఠశాలలో వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం నర్వ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను, రాయికోడ్ లోని మోడల్ అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో చిన్నారుల ఆట పాటలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ మొగులప్ప, డీఈఓ గోవిందరాజులు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్ రెడ్డి, హౌసింగ్ పీడీ శంకర్ నాయక్, నర్వ తహసిల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, పెద్ద కడుమూరు సర్పంచి గోవింద్, యాస్పరేషన్ బ్లాక్ సమన్వయ కర్త బాలాజీ, వ్యవసాయ శాఖ అధికారిని, సీడీ పీవో, ఎంపివోలు, రాయికోడ్ గ్రామ సర్పంచ్, శశికల, ఉప సర్పంచ్ మ్యాతారీ గోపాల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 23 : రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ అన్నారు. మంగళవారం నిజామాబాద్ డీసీసీబీ బ్యాంక్ కాన్ఫరెన్స్ హాల్లో చిన్ని కృష్ణ దేశి విత్తన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి జాతయ రైతు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అన్నదాతల సమస్యల పరిష్కారానికి కమిషన్ పని చేస్తోందన్నారు. దివంగత మాజీ ప్రధాని, రైతు పక్షపాతి చౌదరి చరణ్ సింగ్ జయంతిని పురస్కరించుకొని ప్రతి ఏటా డిసెంబర్ 23న రైతుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రెండేళ్ల ప్రజాపాలనలో రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం రూ.లక్ష కోట్లకు పైగా వెచ్చించి ఎన్నో కార్యక్రమాలను చేపట్టిందన్నారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, సన్న వడ్లకు బోనస్ లాంటి కార్యక్రమాలతో పాటు రైతు సంక్షేమమే లక్ష్యంగా దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఏర్పాటు చేసిందన్నారు. రైతులకు అండగా కమిషన్ రైతు కమిషన్ అన్నదాతలకు అండగా ఉంటుందని గడుగు పేర్కొన్నారు. రైతులు సమస్యలను తమ దృష్టికి తీసుకెళ్తే స్వయంగా వెళ్లి పరిష్కారానికి కృషి చేశామన్నారు. భూ సమస్యల దగ్గర నుంచి మార్కెట్ సమస్యల దాకా పలు అంశాలపై రైతుల కోసం తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సూచనలను కమిషన్ అందిస్తున్నట్లు తెలిపారు. రైజింగ్ తెలంగాణ డాక్యుమెంట్ లో సైతం ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అన్నారు.



క్రీస్తు జీవన విధానం ఆదర్శం

ప్రతిపక్షం, హనుమకొండ, డిసెంబర్ 23: బీఆర్ఎస్ పార్టీ నాయకులు గబ్బెట శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాజీపేట డీజిల్ కాలనీలోని సిద్ధు టెంట్ హౌజ్ లో వద్ద నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాస్టర్ జాషువా ప్రార్థన, బైబిల్ వాఖ్యాలను చదివారు.ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ..సర్వమతాలకు సమాన ప్రాధాన్యం ఇచ్చిన గొప్ప నాయకులు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. తెలంగాణలోని అన్ని పండుగలను ప్రభుత్వ పరంగా అధికారికంగా నిర్వహించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందని తెలిపారు. క్రీస్తు జీవన విధానం మనందరికీ ఆదర్శమని అన్నారు. బైబిల్ ని చదివి దాని సారాన్ని నిజ జీవితంలో పాటించాలని సూచించారు. కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు, బీఆర్ఎస్ నాయకులు నార్లగిరి రమేష్, సుంచు కృష్ణ, కాటపురం రాజు, ఎండి అఫ్జల్, సోని, గబ్బెట కరుణ్ , డివిజన్ అధ్యక్షులు దువ్వ కనుకరాజ్ , బేధరకోట రంజిత్, తేలు సారంగపాణి, బరిగెల వినయ్, ఎండి మహుముద్, సుంచు అశోక్, హుస్సేన్ , దువ్వ నరేష్ , బొల్లె కుమార్, కాళేశ్వరం శ్రీకాంత్, రామగిరి రాంచందర్, మర్యాల కృష్ణ, తండమళ్ళ వేణు, మతిన్, మంద రాజ్ కుమార్, శ్రీకాంత్ , బిల్డర్ రాజ్ కుమార్ , బండి విజయ్, మంద శ్రీనివాస్ , యాకుబ్ రాబర్ట్, నాయిని విజయ, బంగారు సవిత, కొండేటి మంజుల, బంగారి రజిని, నవత , ఎనగందుల సురేష్, కొండేటి వివేక్, గబ్బెట సింయోన్, ఉదయ్ పాల్గొన్నారు



గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- సర్పంచ్ ఎల్లని వెంకటేష్ గౌడ్

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 23: గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని బాకారం గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ అన్నారు. గ్రామంలో మంగళవారం గట్టాల సర్పంచ్ ఆధ్వర్యంలో రోడ్డుకి ఇరువైపున ఉన్న పిచ్చి మొక్కలను జెసిబి సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి, వార్డు సభ్యులు కే. నాగేశ్వర్ రెడ్డి, ఉపేందర్ యాదవ్, కే.అమృత ఎల్లయ్య (శ్రీకాంత్), ఎల్గని ఉమారాణి బిక్షపతి గౌడ్, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



రాబోయే ఎన్నికలను కూడా

సమర్ధవంతంగా నిర్వహించాలి

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 23 : గ్రామ పంచాయతీ ఎన్నికల తరహాలోనే రానున్న రోజుల్లో జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను కూడా సమర్ధవంతంగా నిర్వహించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఎంపీడీఓలు, ఎంపీఓలు సక్సెస్ మీట్ నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తూ, ఎన్నికల విధుల నిర్వహణ పట్ల ప్రతి దశలోనూ అధికారులు మొదలుకుని క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరికీ తగిన సలహాలు, సూచనలు అందిస్తూ జిల్లాలో ఎన్నికలను సజావుగా జరిగేలా కృషి చేసిన కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల విధులు ఎప్పుడు కూడా సవాళ్ళతో కూడుకుని ఉంటాయని అన్నారు. ఇదివరకు ఇవే ఎన్నికల విధులు నిర్వర్తించాము అని తేలికగా తీసుకోకుండా, ఎప్పటికప్పుడు ఎన్నికల విధుల విషయంలో అన్ని అంశాలపై అవగాహన ఏర్పర్చుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. శిక్షణ తరగతులకు తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రతి అంశాన్ని శ్రద్ధగా ఆకళింపు చేసుకుని అప్రమత్తతో ఎన్నికల విధులు నిర్వర్తించాలని సూచించారు. పంచాయతీ ఎన్నికలలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పని చేయడం వల్లే ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా ఎన్నికలను సజావుగా పూర్తి చేసుకోగాలిగామని అన్నారు. రానున్న ఎన్నికల విషయంలోనూ ఇదే స్ఫూర్తితో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీపీఓ శ్రీనివాస్ రావు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ సాయన్న, పంచాయతీ కార్యాలయ ఎ.ఓ రాజబాబు, డీఎల్పీఓలు, ఎంపీడీఓలు, ఎంపీటిఓలు పాల్గొన్నారు.



యేసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

- వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి

ప్రతిపక్షం, హనుమకొండ, డిసెంబర్23: సర్వ మానవాళికి యేసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా చర్చిల సుందరీకరణ పనులపై సంబంధిత అధికారులు, క్రైస్తవ సంఘాల పెద్దలు, పాస్టర్లతో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని పేద క్రైస్తవులకు క్రిస్మస్ వేడుకలను ఏర్పాటు చేసేందుకు ప్రతి నియోజకవర్గానికి రెండు లక్షల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లాలో రెండు నియోజకవర్గాలకు గాను వేడుకల కోసం ఒక్కొ నియోజకవర్గానికి రెండు లక్షల చొప్పున 4 లక్షల రూపాయలను, ఒక్కో నియోజకవర్గ పరిధిలోని 50 చర్చిల అలంకరణకు 30 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిచడం జరుగుతుందని ఆమె తెలిపారు. నియోజకవర్గ శాసనసభ్యుల ఆధ్వర్యంలో నియోజకవర్గంలో రెండు అనువైన ప్రాంతంలో విందు ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో రూ.4.50 లక్షల గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో 94 చర్చిలలో తాత్కాలిక లైటింగ్ డెకరేషన్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అన్ని మతాలకు సమ ప్రాధాన్యతనిస్తూ అన్ని మతాల పండుగలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు, క్రైస్తవ పెద్దలు, పాస్టర్లతో కలిసి మేయర్ క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సమావేశంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి గౌస్ హైదర్, హనుమకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి రాథోడ్ రమేష్, తహశీల్దారు రవీందర్ రెడ్డి, పాస్టర్స్ టిసిఎఫ్ అధ్యక్షులు బిషప్ జాన్ మార్కండేయ, రెవరెండ్ జోసఫ్ ప్రభాకర్, అడ్వైజర్ కె. కురియన్, టిసిఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షులు మంద కుమార్, తదితరులు పాల్గొన్నారు.



నేరానికి శిక్ష తప్పదని చాటిన గుండాల సిఐ

ప్రతిపక్షం, గుండాల, డిసెంబర్ 23: గుండాల పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కీలక కేసులో నేర పరిశోధనకు గుండాల సీ ఐ ఎల్ రవీందర్ తన అసాధారణ నైపుణ్యాన్ని మరోసారి నిరూపించారు. ఆయన సమగ్రంగా చేపట్టిన విచారణ నేరస్తుడిని న్యాయస్థానం ఎదుట నిలబెట్టడంలో కీలకంగా నిలిచింది.ఈ కేసులో సిఐ రవీందర్ సాక్ష్యాలను శాస్త్రీయంగా సేకరించి,ప్రతి అంశాన్ని సూక్ష్మంగా విశ్లేషిస్తూ దర్యాప్తును ముందుకు తీసుకెళ్లారు. ఫలితంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయస్థానం నేరానికి పాల్పడిన నేరస్తుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.7,000 జరిమానా విధిస్తూ కీలక తీర్పు వెలువరించింది.ఈ విజయం ద్వారా పోలీసు శాఖ చట్ట అమలులో చూపుతున్న నిబద్ధతకు బలమైన నిదర్శనం ఏర్పడింది. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజు గుండాల సిఐ రవీందర్ అంకితభావాన్ని,సమర్థవంతమైన పనితీరును ప్రత్యేకంగా ప్రశంసిస్తూ అభినందనలు తెలియజేశారు. ఇలాంటి అధికారుల కృషి వల్లనే పోలీసు వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం పెరుగుతోందని ఎస్పీ పేర్కొన్నారు.



ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- ఆటో రిక్షాల ద్వారా సురక్షితంగా గమ్యాలకు చేర్చాలి
- జిల్లా కలెక్టర్ఆశిష్ సాంగ్వాన్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, డిసెంబర్ 23: రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు ప్రణాళికలతో యువత, విద్యార్థులు, ప్రజలలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ట్రాన్స్ పోర్ట్ అధికారిని ఆదేశించారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. జిల్లాలో ఆటో రిక్షాల ద్వారా ప్రయాణించే ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లా రవాణా అధికారికి కీలక సూచనలు చేశారు. ఆటో రిక్షాలలో పెద్దవారు ముగ్గురికి మించి ప్రయాణించరాదని, అలాగే పిల్లలు ఆరుగురికి మించి ఎక్కించకూడదని స్పష్టం చేశారు. వాహనాల ఫిట్ నెస్ సర్టిఫికెట్, పర్మిట్ తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే విధంగా ఉండాలని, డ్రైవర్లు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఆదేశించారు. ఆటో నడుపుతున్న సమయంలో డ్రైవర్ పక్కన ఎవరూ కూర్చుని ప్రయాణించరాదని హెచ్చరించారు. నిర్దేశించిన పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించినా, అవసరమైన ధ్రువపత్రాలు లేకపోయినా సంబంధిత వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపే సమయంలో వారు సురక్షితంగా ప్రయాణిస్తున్నారా అనే విషయాన్ని గమనించాలని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు పాఠశాలకు ఎలా వస్తున్నారు తెలుసుకోవాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. రహదారి భద్రత నియమాల అమలుకు రవాణా శాఖకు సహకరించాలని కోరారు.

ప్రతి కేసులో బాధితులకు అండగా నిలవండి

- రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, ఆన్లైన్ మోసాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 23 : మంత్లీ క్రైమ్ రివ్యు మీటింగ్ లో భాగంగా మంగళవారం సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన ఇన్వెస్టిగేషన్లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్, మిస్సింగ్, ఎబ్.బి.డబ్ల్యూ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇన్వెస్టిగేషన్ లో వేగం పెంచాలని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు అండగా నిలవాలని అధికారులకు సూచించడం జరిగింది. లాంగ్ పెండింగ్ కేసుల చేధనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, ఇన్వెస్టిగేషన్లో సందేహాలు ఉంటే, ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలన్నారు. ఎస్.హెచ్.ఓ లు తమ ఏరియాలో గల ప్రతి గ్రామాన్ని సందర్శించి, ఆయా ప్రాంతాలలో గల సమస్యలను తెలుసుకోవాలని అన్నారు. విలేజ్ పోలీసు అధికారులు తమకు కేటాయించిన గ్రామలపై పూర్తి అవగాహన కలిగి, ముందస్తు సమాచారాన్ని సేకరించాలన్నారు. రౌడీ షీటర్స్, సస్పెక్ట్ ల కదలికలై నిఘా ఉంచాలన్నారు. బ్లూకోల్ట్స్ మరియు నైట్ పెట్రోలింగ్ సిబ్బంది "పాపిలోన్ డివైస్" లను వినియోగిస్తూ.. అనుమానాస్పద వ్యక్తుల ఫింగర్ ప్రింట్స్ సేకరించాలన్నారు. విమెన్ సేఫ్టీ, రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, ఆన్లైన్ మోసాల గురించి ఆయా ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలను చైతన్య పరచలాని అన్నారు. అనంతరం యస్.హెచ్.ఓ వాహనాలను తనిఖీ చేస్తూ.. ప్రతి వాహనాన్నిరెగ్యులర్ సర్వీసింగ్ చేయిస్తూ, ఎలాంటి రిపేర్స్ లేకుండా పూర్తి కండిషన్ లో ఉండే విధంగా చూసుకోవాలని డ్రైవరులకు సూచించారు. ముఖ్యంగా డ్రైవర్స్ వాహనాలను ఎట్టి పరిస్థితులలోనూ రాంగ్ రూట్లో నడపరాదని అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు.ఎస్పీ సిహెచ్. రఘునందన్ రావ్, డియస్పిలు సత్యయ్య గౌడ్, ప్రభాకర్, వెంకట్ రెడ్డి, సైదా నాయక్, సురేందర్ రెడ్డి, ఇన్స్పెక్టర్స్ రమేష్, కిరణ్ కుమార్, నాగేశ్వర్ రావ్, సదా నాగరాజు, ప్రవీణ్ రెడ్డి, నాగేశ్వర్ రావ్, ఆర్.ఐ లు రామా రావ్, రాజశేఖర్, జిల్లా ఇన్స్పెక్టర్స్, సబ్ఇన్స్పెక్టర్స్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన ఉన్నతాధికారుల సమావేశంలో వార్షిక నేరగణాంక నివేదిక - 2025ను విడుదల చేశారు.

సింగరేణిని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తాం

ప్రతిపక్షం, మంచిర్యాల, డిసెంబర్ 23: సింగరేణి సంస్థలు అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తామని శ్రీరాంపూర్ జిఎం మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో సింగరేణి డే సందర్భంగా జరిగిన ఉత్సవాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు సింగరేణి సంస్థ 137 వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పలు విషయాలు వెల్లడించారు. సింగరేణి జరుగుతున్న పరిణామాల దృష్ట్యా ఇప్పటికే 246 సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసిందన్నారు. 19 20 డిసెంబర్ 23న సింగరేణి సంస్థగా ఏర్పడిందన్నారు. ప్రస్తుతం సింగరేణిలో సుమారు 40 వేల కార్మికులకు పైన విత్తమ విధులను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్మికులకు అన్ని రంగాలలో సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం మహిళా సిబ్బంది సైతం సింగరేణి సంస్థలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గతంలో సింగరేణి సంస్థను అన్ని రంగాలలో ముందు తీసుకెళ్లి కార్మికుల సంక్షేమం కోసం తగిన ఏర్పాటను చేస్తుందన్నారు. కార్మికులు విధులలో గైర్హాజరు కాకుండా పాల్గొనాలని సూచించారు. కార్మికులు సిబ్బంది సంస్థ చేపట్టే ప్రతి లక్ష్యాలను సాధించాలన్నారు. భద్రతా విషయంలో అనేక రక్షణ పద్ధతులలో ముందుకు సాగుతుందన్నారు. జీరో ప్రమాదాలు లేకుండా సింగరేణి సంస్థ తగు జాగ్రత్తలు తీసుకోనున్నదని తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి కార్మికులు విశ్రాంత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



లోకేశ్ అవినీతిలో పవన్‌కు వాటా ఉంది. మెడికల్ కాలేజీల దందాలోనూ ఆయనకు వాటా ఉన్నట్లుంది. అందుకే అరెస్టు అనేసరికి భయపడుతున్నారు. సీజ్ ద షిప్ అన్నారు. ఏమైంది? పోర్టులో అక్రమ రవాణా మరింత పెరిగింది. నాగబాబుకు మంత్రి పదవి అన్నారు. ఓ డీఎస్పీ సెటిల్మెంట్లు చేస్తున్నారని, శిక్షించాలని అడిగారు. ఏమైనా అయ్యాయా? కూటమిలో మీ పరిస్థితి అదీ.

- వైసీపీ నేత అంబటి రాంబాబు

ప్రజల దృష్టిని మళ్లించేందుకు మార్ట్‌గేజ్ డ్రామాలు

- పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అత్తు ఇమామ్



ప్రతిపక్షం సిద్దిపేట, డిసెంబర్ 23: ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు మార్టిగేజ్ డ్రామాలు చేస్తున్నారని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మండిపడ్డారు. సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హరీష్‌రావు తన ఇల్లు తాకట్టు పెట్టినట్లు సోషల్ మీడియా, పత్రికల్లో వచ్చిన వార్తలు బాధాకరమన్నారు. సిద్ధిపేటలో ఆయన ప్రస్తుతం ప్రభుత్వ భవనమైన ఎమ్మెల్యే బిల్డింగ్‌లో నివాసం ఉంటున్నారని, తాకట్టు కారణంగా ఇల్లు లేకపోయినందున ప్రభుత్వం ఆయనకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయించాలని వ్యాఖ్యానించారు. గత పదేళ్లుగా అధికారంలో ఉన్న కల్వకుంట్ల కుటుంబం రాష్ట్ర ఖజానాను దోచుకుందని ఆరోపించారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైపే ఆశతో చూస్తున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని, ప్రజలు ఆయనను మరో పదేళ్లు ముఖ్యమంత్రిగా దీవించాలని ఆకాంక్షించారు. త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్యాదారి మధు, గయాజుద్దీన్, హర్షద్, బాబా, బాబు, నజ్జు, ఫయాజ్ పాల్గొన్నారు.



స్పైస్ వరల్డ్ స్కూల్లో ఘనంగా రైతు దినోత్సవం

ప్రతిపక్షం, సిద్దిపేట, డిసెంబర్ 23: స్పైస్ వరల్డ్ స్కూల్లో జాతీయ రైతు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, కార్యక్రమాలు రైతుల జీవన పోరాటాన్ని హృదయానికి హత్తుకునేలా ఆవిష్కరించాయి. మనం తినే ప్రతి మెతుకు వెనుక రైతు పడ్డ కష్టం, చెమట చుక్కలు, ఎండనక, వాననక, పగలనక, రాత్రనక అహర్నిశలు శ్రమించి దేశానికి అన్నం పెడుతున్న రైతుల త్యాగాలను విద్యార్థులు తమ ప్రదర్శనల ద్వారా అద్భుతంగా చూపించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, రైతులే దేశానికి వెన్నుముకలాంటివారని పేర్కొన్నారు. మట్టిని దైవంగా భావించి, పైరును ప్రాణంగా చూసుకుంటూ స్వేదంతో పంట పండించే రైతు అందరికీ అన్నం పెడుతున్నాడని వివరించారు. రైతుల కష్టాలు, నష్టాలు, వారి సేవలను విద్యార్థులు తెలుసుకోవడం ఎంతో అవసరమని ఆయన అన్నారు. రైతు రాజ్యం రావాలని, రైతు రాజుగా మారాలని ఆకాంక్షిస్తూ జాతీయ రైతు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎర్రబోలు శ్రీకాంత్ రెడ్డి, ఎర్రబోలు రాజిరెడ్డి, ఎర్రబోలు రాజారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రామయంపేట్ కెనాల్‌లో జింక

- సురక్షితంగా బయటకు తీసిన ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది

ప్రతిపక్షం, దౌల్తాబాద్, డిసెంబర్ 23: మండల పరిధిలోని ఇందుప్రియల్ గ్రామ సమీపంలోని రామయంపేట్ కెనాల్‌లో మంగళవారం ఉదయం ఓ జింక అదుపుతప్పి పడిన ఘటన చోటుచేసుకుంది. వ్యవసాయ పనుల నిమిత్తం కెనాల్ వద్దకు వెళ్లిన రైతు భాస్కర్ ఈ విషయాన్ని గమనించి వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. రైతు ఇచ్చిన సమాచారంతో స్పందించిన ఫారెస్ట్ శాఖ బీట్ ఆఫీసర్ వేణు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ఫారెస్ట్ అధికారులు తగిన చర్యలు చేపట్టి జింకను సురక్షితంగా కెనాల్ నుండి బయటకు తీసి అటవీ ప్రాంతంలో విడిచి పెట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, పరిసర గ్రామాల్లో జింకల సంచారం ఉన్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే వన్యప్రాణులకు ఎలాంటి హాని కలగకుండా సహకరించాలని ప్రజలను కోరారు.



మెదక్ ఎస్పీ డి.వి. శ్రీనివాస రావుకు సీనియర్ ఎస్పీగా పదోన్నతి

ప్రతిపక్షం, మెదక్ టౌన్ డిసెంబర్ 23: మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావుకు సీనియర్ ఎస్పీగా పదోన్నతి లభించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణ రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు, వీరితో పాటు డీఎస్పీలు నరేందర్ గౌడ్, సుభాష్ చంద్ర బోస్, ప్రసన్న కుమార్, రంగ నాయక్‌తో పాటు సీఐలు, ఎస్సైలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది కూడా ఎస్పీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



నార్సింగి సర్పంచ్ కు ఎమ్మెల్యే సన్మానం

ప్రతిపక్షం, చేగుంట, డిసెంబర్ 23: నార్సింగి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా ఆకుల సుజాత మల్లేశం గౌడ్ గెలుపొందడంతో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. భీఆర్ఎస్ నాయకులతో కలిసి సర్పంచ్ ఆకుల సుజాత మల్లేశం గౌడ్ ఇంటికి పార్టీ నాయకులతో వెళ్లిన ఎమ్మెల్యే దంపతులను సన్మానించి సత్కరించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మైలారం బాబు మాజీ జెడ్పిటిసి క్రిష్ణరెడ్డి పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు 500 మందితో పటిష్ట బందోబస్తు

- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు



ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 23: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ సిఎస్ఐ కేథడ్రల్ చర్చికి క్రిస్మస్ పర్వదినాన పెద్ద ఎత్తున భక్తులు తరలిరనున్న నేపథ్యంలో శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీస్ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. మంగళవారం చర్చి ఆవరణలో ఉన్న సండే స్కూల్ బిల్డింగ్ నిర్వహించిన సమావేశంలో ఎస్పీ డి వి శ్రీనివాస్ రావు మాట్లాడారు. పోలీస్ సిబ్బందిని 4 సెక్టార్‌లుగా, మూడు షిఫ్ట్‌లుగా విభజించి, నిరంతర పర్యవేక్షణలో మొత్తం 496 మంది అధికారులు, సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు విధులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇందులో డీఎస్పీలు 4, సీఐలు 12, ఎస్సైలు 47, ఏఎస్సైలు 31, హెడ్ కానిస్టేబుళ్లు 46, పోలీస్ కానిస్టేబుళ్లు 185, హోంగార్డులు 87, 3 క్యూఆర్టీ బృందాలు 51 మంది, 3 రోప్ పార్టీలు 33 మంది ఉన్నట్లు తెలిపారు. ఈ బందోబస్తును కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సీసీ కెమెరాల సహాయంతో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. జాతరకు వచ్చే భక్తులు తమ వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలపకుండా, పార్కింగ్‌కు కేటాయించిన స్థలాల్లోనే నిలపాలని సూచించారు. ఎవరైనా చిన్నారులు తప్పిపోయినట్లయితే చర్చ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలీస్ కంట్రోల్ రూమ్‌లో సమాచారం ఇవ్వాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. భద్రతలో భాగంగా బీడీ టీమ్‌లు, డాగ్ స్క్వాడ్‌లు మోహరించామని, భద్రత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు ఎస్పీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ శ్రీ. ఎస్ మహేందర్, డియస్పి లు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, రంగా నాయక్, సీఐ లు, ఎసై లు సిబ్బంది పాల్గొన్నారు.



వలకు చిక్కిన 16 కిలోల చేప

ప్రతిపక్షం, నంగునూరు, డిసెంబర్ 23: సిద్దిపేట జిల్లా నంగునూరు మండల పరిధిలోని పెద్ద వాగు (మోయతుమ్మెద వాగు)లో మత్స్యకారులకు 16 కిలోల చేప వలలో పడింది. నంగునూరు మండల కేంద్రానికి చెందిన పల్లపు వెంకటయ్య మంగళ వారం పెద్దవాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో వలకు పెద్ద చేప చిక్కడంతో అతి కష్టం మీద ఒడ్డుకు చేర్చాడు. చేపను గ్రామంలోకి తీసుకు వచ్చాడు. చేప పెద్దదిగా ఉండడంతో గ్రామస్తులు వింతగా తిలకించారు. ఈ చేప బరువు 16 కిలోలు ఉందని వెంకటయ్య తెలిపారు.



హ్యాట్రిక్ వార్డు మెంబర్ హైమద్

ప్రతిపక్షం, చేర్యాల, డిసెంబర్ 23: ఒకే వార్డులో మూడు పర్యాయాలు గెలుస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నాడు ఓ వార్డు సభ్యుడు.. వివరాల్లోకి వెళ్తే చేర్యాల మండలం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఆకునూరు గ్రామంలో ఏడో వార్డు సభ్యుడిగా 2014 నుంచి 2025 ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు గెలుస్తూ హ్యాడ్రిక్ సాధించాడు. స్వంత ప్రయోజనాల కన్నా ప్రజల ప్రయోజనాలే మిన్న అని భావించి వార్డులో ఉన్న ప్రజలకు ఏ సమస్య తమ దృష్టికి వచ్చిన వెంటనే స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాడు. ఎవరికి ఆపద వచ్చినా అండగా ఉంటూ ప్రజల కష్టసుఖాల్లో తోడుగా నిలిచి కాలనీ ప్రజల మనసు గెలుచుకున్నాడు. ఈ మధ్యకాలంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించాడు. అతన్ని గ్రామస్తులు కాలనీవాసులు శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. తమ కు సేవలను గుర్తించి ఎన్నుకున్న ప్రజలకు, సహకరించిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు హైమద్ కృతజ్ఞతలు తెలిపారు.



కేసీఆర్ పాలనలో చేసిందేమీ లేదు

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 23 : కేసీఆర్‌ను పాలమూరుకు ఎంపీగా గెలిపిస్తే 5 ఏళ్లలో 5 సార్లు కూడా పాలమూరు పోలేదని, ముఖ్యమంత్రి అయిన తర్వాత 10 సంవత్సరాల పాలనలో పాలమూరుకి ఎంత అభివృద్ధికి ఖర్చుపెట్టారో, గజ్వేల్ కు ఎంత ఖర్చు పెట్టారో లెక్కలు తేల్చాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. మంగళవారం మెదక్ జిల్లాలోని గ్రామపంచాయతీ ఎన్నికలలో బీజేపీ బలపరిచిన నూతన సర్పంచులు ఉప సర్పంచులు వార్డు మెంబర్లకు ఆత్మీయ సమ్మేళనం స్థానిక జికేఆర్ గార్డెన్ లో జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ అధ్యక్షతన సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఇచ్చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పాలమూరు, రంగారెడ్డి ఎత్తి పోతల పథకాన్ని పూర్తి చేస్తానని ఇంత వరకు చేయలేదన్నారు. పదేళ్లు పాలించిన కేసీఆర్ ఒక్కరోజు పాలమూరు పర్యటించలేదని ఎంపీగా ఉన్న సమయంలో సైతం పార్లమెంటులో పాలమూరు సమస్యలను మాట్లాడలేదని పాలమూరులో మాత్రం వలసలు ఆగుతాయి కరువు ప్రాంతాల నుండి విముక్తి చేస్తానని మాటలు చెప్పాడని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి చమరగీతం పాడుతామనీ జోస్యం చెప్పారు. సర్పంచ్ గా ప్రజల మన్నలను పొందాలనీ. గెలిచిన సర్పంచ్ లకు ఎంపి నిధుల నుంచి ఒక్కో గ్రామానికి రూ 25 లక్షలు కేటాయిస్తాను అన్న హామీని కచ్చితంగా ఇస్తానని ఆయన తెలిపారు. అనంతరం గెలిచిన నూతన సర్పంచులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్చార్జి నరసింహారెడ్డి, బీజేపీ నాయకులు గడ్డం శ్రీనివాస్, సిహెచ్ శ్రీనివాస్, రంజిత్ రెడ్డి, సురేష్, రాగి రాములు, శ్రీనివాస్ గౌడ్, శంకర్ గౌడ్, గడ్డం కాశీనాథ్, సంతోష్ కుమార్, ఎమ్మెల్యేన్ రెడ్డి. విజయ్ కుమార్, నాయిని ప్రసాద్. శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యం

- జిల్లా కలెక్టర్ కె. హైమావతి



ప్రతిపక్షం, సిద్దిపేట, డిసెంబర్ 23: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళశాలలో మెరుగైన పలితాలు సాధించాలని ప్రతి ఒక్క విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత కార్యాలయ సముదాయం లోని కాన్ఫరెన్స్ హల్ లో ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల ప్రిన్సిపల్, సిబ్బందితో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో ఆయా కళాశాల వారిగా గత ఏడాది , ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన పరీక్షల ఫలితాలపై సమీక్ష నిర్వహించి ఎదురైన సమస్యల పై ప్రిన్సిపల్ లతో ఆరా తీశారు. ప్రిన్సిపల్ అధ్యాపకులు విద్యార్థులు అన్ని సబ్జెక్ట్ పైన ఎక్కువ ఏకాగ్రత పెట్టాలని కఠిన సబ్జెక్ట్ మీద ఎక్కువ ఫోకస్ పెట్టి చదివించాలని తెలిపారు. జనవరి, ఫిబ్రవరి నెలలో బోర్డ్ పరీక్షల వరకు 50 రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చెయ్యాలని పిల్లలకు ప్రత్యేక తరగతులు పెట్టాలనీ ప్రతి ఒక్కరు ఉత్తీర్ణత కావాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థులనీ ప్రోత్సహించి చదువులో మంచి ఉత్తీర్ణత సాధిస్తే వచ్చే ఏడాదీ ఎక్కువ మొత్తంలో కళాశాలలో అడ్మిషన్లు వస్తాయని ఆది దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు పనిచేయాలని ఆదేశించారు. ప్రిన్సిపల్ , అధ్యాపకులు మీ యొక్క ధర్మం సక్రమంగా నిర్వహించాలి. విద్యార్థులకు మంచి చదువు క్రమశిక్షణ నేర్పించి వారు ఉన్నత శిఖరాలకు చేరుకునేలా తయారు చెయ్యాలని తెలిపారు. అలాగే జిల్లాలో పలు జూనియర్ కళాశాలలో మేజర్, మైనర్ రిపేర్లు జనవరి 15 లోపు పూర్తి చెయ్యాలి. కళాశాల కావలసిన మౌలిక వసతుల కల్పించడం ప్రాధాన్యత ప్రకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా ఆపకపోతే రైతులతో ఉద్యమం

- ఇసుక తరలింపు రైతులకు తీవ్ర నష్టం
- హల్దీ వాగును పరిశీలించిన బీఆర్ఎస్‌బృందం



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 23: గత 45 రోజుల నుండి హల్ది వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని అక్రమ రవాణాను ఖండిస్తూ మంగళవారం సంగాయిగూడ తాండ హల్ది వాగు వద్దకు చేరుకుని బీఆర్ఎస్ నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి. ఎమ్మెల్సీ మాధవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, నాయకులు కంఠరెడ్డి తిరుపతి రె, తదితరులు పాల్గొన్నారు. వీరు వాగులో క్వారీ ఏర్పాటు చేసుకున్న ప్రాంతాన్ని హల్ది వాగు వద్దకు వెళ్లి ఇసుక తరలింపు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. వాగు నుండి ఇసుకను ఏలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలించడంతో హల్ది వాగులో భూగర్భ జలాలు తగ్గి రైతులు తీవ్రంగా ఇబ్బందుల గురవుతున్నారని. ఎలాంటి అనుమతులు లేకుండా ఎమ్మెల్యే తన అనుచరులతో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నాడని. ఇదేమిటని అడిగిన వారి పైన ఎమ్మెల్యే అనుచారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. 45 రోజులుగా అక్రమంగా ఇసుకను జహీరాబాద్, బీదర్, హైదరాబాద్ తరలిస్తున్నరని వారు ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోకపోతే కలెక్టర్ కార్యాలయం ముందు రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హల్ది వాగు చేరుకున్న రెవెన్యూ పోలీసులు


సంగాయిగూడ తాండ హల్ది వాగు వద్ద కు భారత రాష్ట్ర సమితి బృందం పర్యటిస్తున్న క్రమంలో మెదక్ రెవెన్యూ పోలీస్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు అక్రమంగా ఇసుకను తరలించడం ఆపివేయకపోతే రైతులతో కలిసి పోరాటం చేస్తామని బిఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. వాగు సమీపంలో ఉన్న జెసిబిలు. అడవిలో ఉండటం మూలంగా అపరిది కొల్చారం మండల పరిధిలోకి రావడం జరుగుతుందని వాటిని ఈ ప్రాంతంలో ఎందుకు పెట్టారో తెలుసుకుంటామని తాసిల్దార్ లక్ష్మణ్ తెలిపారు వాటిని కొల్చారం పోలీస్ స్టేషన్ అప్పజప్పడం జరిగిందని అన్నారు

కలెక్టర్ ను కలిసిన బీఆర్ఎస్ బృందం

మెదక్ మండల పరిధిలోని హల్ది వాగు నుండి ఇసుకను అక్రమంగా తరలించడంపై భారత రాష్ట్ర సమితి నాయకులు జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కలిశారు. అక్రమంగా ఇసుకను జహీరాబాద్ బీదర్ హైదరాబాద్ వంటి ప్రాంతాలకు తరలించడం జరుగుతుందని వాటిని వెంటనే అక్రమ రవాణాను అడ్డుకోవాలని లేకపోతే భూగర్భ జలాలు ఏంటి రైతులు తీవ్ర నష్టానికి గురవుతారని వారు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా జెసిబిలు లారీలు తో అక్రమంగా ఇసుక నెల తరలిస్తారని ఎందుకు రెవెన్యూ పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని కలెక్టర్కు వివరించారు ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వైస్ చైర్మన్ లావణ్య రెడ్డి పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు మండల అధ్యక్షులు అంజాగౌడ్. మాజీ ఎంపీటీసీలు సర్పంచులు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



2025 జులైలో పాప పుట్టిన తర్వాత, తన శరీరాన్ని చూసే కోణం మారింది. 'వార్ 2' సినిమాలో బికినీ సీన్ కోసం చాలా కష్టపడ్డాను. అప్పట్లో పర్ఫెక్ట్ ఫిగర్ కోసం తాపత్రయపడ్డా. కానీ ఒక ప్రాణానికి జన్మనిచ్చిన తన శరీరం పట్ల చాలా గౌరవం పెరిగింది సైజ్ ముఖ్యం కాదని గుర్తించాను.
- హీరోయిన్ కియారా అద్వానీ



రాజ్యాంగం రద్దుకు బీజేపీ కుట్ర


- జర్మనీ పర్యటనలో రాహుల్ గాంధీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 23: భారత రాజ్యాంగాన్ని రద్దు చేయడమే లక్ష్యంగా బీజేపీ నేతలు ఆలోచిస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. జర్మనీ పర్యటనలో రాహుల్ గాంధీ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రాలు, భాషలు, మతాల మధ్య ఉన్న సమానత్వ భావనను దెబ్బతీస్తూ.. రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను బీజేపీ కాలరాస్తోందని ఈ సందర్భంగా మండిపడ్డారు. ప్రపంచంలో భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని.. అది యావత్ ప్రపంచ సంపద అని ఈ సందర్భంగా రాహుల్ అన్నారు. దేశంలోని ఏ ప్రజాస్వామ్య వ్యవస్థపై జరుగుతున్న దాడినైనా.. దానిని అంతర్జాతీయ స్థాయి దాడిగానే పరిగణించాలన్నారు. బీజేపీ ప్రభుత్వం.. రాజ్యాంగ సంస్థల సహకారంతో రాజకీయ అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు వాటిని ఆయుధాలుగా ఉపయోగించుకుంటోందని ఆయన ఆరోపించారు. భారత్‌లోని ఈడీ, సీబీఐ, ఎన్నికల కమిషన్ల పనితీరును లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ తీవ్రంగా తప్పుబట్టారు. బీజేపీ వాటిని సొంత ఆస్తులుగా వాడుకుంటూ.. ఓట్ల చోరీకి పాల్పడుతోందని ధ్వజమెత్తారు. అందువల్లే ఎన్డీఏ ఎన్ని అక్రమాలకు పాల్పడుతున్నా దర్యాప్తు సంస్థలు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నాయన్నారు రాహుల్. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతిపక్ష నేతలపైనే కేసులు పెడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నాయని చెప్పుకొచ్చారాయన. హరియాణాఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిందని తాము నిరూపించామని.. అలాగే వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో ఓటు చోరీ జరిగినట్టు తాను ఎన్నో రుజువులు చూపిస్తున్నా.. ఎన్నికల సంఘం మిన్నకుండిపోయిందని విమర్శించారు. మన్మోహన్ సింగ్ కాలంనాటి ఆర్థిక విధానాలనే ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని.. ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న ఆర్థిక నమూనాపై కూడా తీవ్రస్థాయిలో మండిపడ్డారు రాహుల్. మోదీ ఆర్థిక విధానం ప్రస్తుతం పూర్తిగా నిలిచిపోయిందన్నారు. దేశంలోని సంస్థాగత వ్యవస్థపై జరుగుతున్న ఈ దాడిని ఎదుర్కొనేందుకు తాము ప్రతిపక్షంలో ఉంటూ ఓ బలమైన ప్రతిఘటనా వ్యవస్థను రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు.



విశ్వ వీక్షణం





మనసు దోచే సుందర ప్రాంతాలు

ఓసారి అలా చుట్టి రండి మరి!!

స్నేహితులతో లేదా కుటుంబంతో కలిసి విహారయాత్రకు వెళ్లాలనుకుంటున్నారా? చక్కని ప్రదేశాలను ఆస్వాదించాలనుకుంటున్నారా? అయితే, గుర్గావ్‌లోని ఈ ప్రదేశాలను ఎంచుకోండి. ఇవి గుర్గావ్ నుండి కొద్ది దూరంలోనే ఉన్నాయి. ఇక్కడ మీరు బోటింగ్, ఫిషింగ్ లేదా క్యాంపింగ్ కూడా చేయవచ్చు. ఇక్కడ సూర్యాస్తమయం పాయింట్ ఎంతగానో ఆకట్టుకుంటుంది. అందమైన జలపాతాలు, సోహ్నాలో వేడి నీటి బుగ్గలను ఆస్వాదించవచ్చు. పురాతన సోహ్నా ఆలయాన్ని కూడా చూడవచ్చు. సమీపంలోని అందమైన గార్డెన్‌లలో తిరగవచ్చు.

హుడా సిటీ సెంటర్

మీకు షాపింగ్ అంటే ఇష్టం ఉంటే, ఫరీదాబాద్ హుడా సిటీ సెంటర్‌కి వెళ్లవచ్చు. ఇక్కడ ఉన్న తాజ్ నగర్‌లోని అందమైన తోటలను, చారిత్రిక ఓల్డ్ ఫరీదాబాద్ ను చూడవచ్చు. మీరు జంతు ప్రేమికులైతే, గుర్గావ్ సమీపంలోని సుల్తాన్‌పూర్ నేషనల్ పార్క్‌ని సందర్శించవచ్చు. ఇక్కడ మీరు అనేక రకాల జంతువులు, పక్షులను చూడవచ్చు. మీరు ప్రకృతి మధ్య ప్రశాంత వాతావరణాన్ని ఆస్వాదించాలని అనుకుంటే, ప్రదేశం మీకు ఉత్తమమైనది. సాహసం, వినోదం కావాలంటే ఇది మీకు ఉత్తమ ప్రదేశం. ఇక్కడ థియేటర్లు, రైడ్‌లు, రెస్టారెంట్‌లు అందుబాటులో ఉంటాయి. ఇక్కడ మీరు మీ భాగస్వామి లేదా స్నేహితులతో సరదాగా గడపవచ్చు.

పటౌడీ ప్యాలెస్

మీరు చారిత్రక విషయాలను చూడాలనుకుంటే, పటౌడీ ప్యాలెస్‌కి వెళ్లవచ్చు. ఇక్కడ మీరు చారిత్రక నిర్మాణాన్ని ఆస్వాదించవచ్చు. ఈ ప్రదేశం ఫొటోషూట్ కోసం కూడా చాలా బాగుంటుంది. ఇక్కడ మీరు చరిత్రకు సంబంధించిన అనేక విషయాలను తెలుసుకుంటారు. మీరు రాచరిక జీవితాన్ని అనుభవించాలనుకుంటే ఇది మీకు సరైన ప్రదేశం.





ఇస్త్రీ పెట్టెను శుభ్రం చేయండిలా?!


ఇస్త్రీ చేసేటపుడు ఐరన్ బాక్స్ బట్టలకు అతుక్కుపోయిందా? ఇలా చేయండి నల్లబడిన మీ దుస్తులు తళతళలాడుతూ కనిపిస్తాయి. చాలా ఇళ్లలో బట్టలను స్వయంగా ఇస్త్రీ చేసుకుంటారు. ఆఫీసులకు, పాఠశాలలకు వెళ్లే తొందరలో హడావుడిగా ఇస్త్రీ చేస్తారు. అటువంటి పరిస్థితిలో ఐరన్ బాక్స్ బట్టలకు అతుక్కుపోయి, వస్త్రం కాలిపోయి ఇబ్బందులు పడుతూ ఉంటారు. దానిని మీరు శుభ్రం చేయాలనుకుంటే, ఇలా చేసి చూడండి. ఐరన్ బాక్స్ చల్లారనివ్వండి. ఏదైనా టూత్ పేస్ట్ ను ఒక గిన్నెలో తీసుకోండి. సుమారు రెండు చెంచాల పేస్ట్ లో రెండు చెంచాల బేకింగ్ సోడా కలపాలి. ఇప్పుడు అందులో దాదాపు రెండు చెంచాల వెనిగర్ వేసి అన్నీ మిక్స్ చేసి పేస్ట్ లా చేయాలి. దీనిని ఈ పేస్ట్‌ను ఐరన్ బాక్స్ కు ఐదు నిమిషాలు అప్లై చేసి, అలాగే వదిలేయండి. తర్వాత, స్క్రబ్బర్ సహాయంతో మరకలను శుభ్రం చేయడానికి ప్రయత్నించండి. మరకలను సున్నితంగా రుద్దడం ప్రారంభించండి. శుభ్రంగా ఉన్నప్పుడు, పొడి గుడ్డతో శుభ్రం చేయండి. ఈ విధంగా రెండు, మూడు సార్లు శుభ్రపరచడం ద్వారా, మీ ఐరన్ బాక్స్ పూర్తిగా శుభ్రంగా మారుతుంది. చివరగా.. ఇప్పుడు దానిని ఆన్ చేసి, ఏదైనా పాత, చెడిపోయిన కాటన్ క్లాత్‌పై రెండు, మూడుసార్లు తిప్పండి. దీంతో మిగిలిన మురికి కూడా పూర్తిగా క్లీన్ అవుతుంది. మీకు కావాలంటే, మీరు బేకింగ్ సోడా, నిమ్మకాయ సహాయంతో కూడా శుభ్రం చేయవచ్చు. దీని కోసం, ఒక గిన్నెలో 3 లేదా 4 స్పూన్ల బేకింగ్ సోడా ఉంచండి. ఇప్పుడు అందులో 2 లేదా 3 స్పూన్ల నిమ్మరసం పిండాలి. మందపాటి పేస్ట్ సిద్ధం చేయండి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని ఐరన్ బాక్స్ పై అప్లై చేసి 5 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. ఇప్పుడు దానిని బ్రష్‌తో రుద్దడం ద్వారా శుభ్రం చేయండి.



బంగ్లా మూకదాడిపై వీహెచ్‌పీ నిరసన

- బంగ్లాదేశ్ హైకమిషన్ వద్ద ఉద్రిక్తత

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 23: దేశ రాజధాని ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ వద్ద మంగళవారంనాడు తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బంగ్లాలో హిందువులపై దాడులను ఖండిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్దఎత్తున బంగ్లా హైకమిషన్ కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో ముందుజాగ్రత్త చర్యగా ఢిల్లీ పోలీసులు హైకమిషన్ కార్యాలయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రదర్శకులు బారికేడ్లను నెట్టుకుని లోపలకు దూసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఢాకాలో జరిగిన ఘటనను నిరసిస్తూ ప్రదర్శకులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. వీహెచ్‌పీతో పాటు పలు హిందూ సంస్థలు ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నాయి. బంగ్లాదేశ్‌లోని మయమన్ సింగ్ జిల్లాలో గత వారం దీపు చంద్ర దాస్ అనే 25 ఏళ్ల హిందూ యువకుడిని దుండగులు గత వారంలో దారుణంగా కొట్టిచంపారు. చెట్టుకు వేలాడదీసి ఉరితీశారు. అనంతరం మృతదేహాన్ని రోడ్డుపై పడేసి నిప్పుపెట్టారు. ఈ ఘటనపై భారత్‌లో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ దేశాలు సైతం ఈ ఘటనను తీవ్రంగా ఖండించాయి. దీపు చంద్రదాస్ దారుణ హత్యతో ప్రమేయమున్న 12 మందిని బంగ్లా పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. బంగ్లాదేశ్‌లో గత ఏడాది షేక్ హసీనా ప్రభుత్వం గద్దె దిగడానికి దారితీసిన విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించిన షరీఫ్ ఒస్మాన్ హాదీపై గుర్తుతెలియని వ్యక్తులు ఇటీవల కాల్పులు జరపడం, సింగపూర్‌లో చికిత్స పొందుతూ అతను కన్నుమూయడంతో దేశ వ్యాప్తంగా హింసాకాండ చెలరేగింది. దీనికి కొనసాగింపుగా నేషనల్ సిటిజన్ పార్టీ యువనేత మొతలేబ్ సిక్దార్‌పై సోమవారంనాడు గుర్తుతెలియని సాయుధుడు కాల్పులు జరిపాడు. ఆ కాల్పుల్లో అతని తల ఎడమ వైపు తూటా దూసుకెళ్లింది. ప్రస్తుతం ఆసుపత్రిలో సిక్దార్ చికిత్స పొందుతున్నాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న బంగ్లాదేశ్‌లో పార్లమెంట్ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి.



బిహార్ అభివృద్ధిపై ప్రశంసలు

- ఎన్డీయే ప్రభుత్వంపై శశిథరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 23: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అధికార బీజేపీపై ప్రశంసలు కురిపిస్తూ సొంత పార్టీ నేతల నుంచి తరచు విమర్శలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్డీయే పాలిత రాష్ట్రమైన బిహార్ అభివృద్ధిపై ప్రశంసలు కురిపించారు. బిహార్‌లో మౌలిక వసతుల కల్పనపై నితీష్ కుమార్ ప్రభుత్వం గట్టి కృషి చేస్తోందని కితాబిచ్చారు. బిహార్‌లో నితీష్ కుమార్ పార్టీ జేడీయూతో బీజేపీ పొత్తు సాగిస్తోంది. నలందా యూనివర్శిటీ పునరుద్ధరణ అనంతరం జరిగిన తొలి నలందా లిటరరీ ఫెస్టివల్‌లో శశిథరూర్ మంగళవారంనాడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో తాను విన్న దానికంటే బిహార్‌లో మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయన్నారు. రోడ్డు బాగున్నాయని, ఇంతకుముందెన్నడూ లేని విధంగా అర్ధరాత్రి కూడా ప్రజలు రోడ్లపైకి వస్తున్నారని, విద్యుత్, నీటి సదుపాయాలు కూడా సరిగ్గా ఉన్నాయని అన్నారు. గత కొన్నేళ్లుగా చాలా మంచిపనులు జరిగాయనడంలో సందేహం లేదని చెప్పారు. నితీష్‌కుమార్ గురించి అడిగినప్పుడు, రాజకీయాల్లోకి తనను లాగవద్దని, ఇక్కడి జరిగిన అభివృద్ధి మాత్రంచాలా సంతోషంగా ఉందని సమాధానమిచ్చారు. బీహార్ ప్రజలు, ప్రతినిధులకు ఈ క్రెడిట్ దక్కుతుందన్నారు. కాగా, బిహార్‌లో శశిథరూర్ చేసిన తాజా వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఇంకా స్పందించలేదు.



అసోంలో చెలరేగిన హింస

- ఇద్దరి మృతి.. 34 మందికి గాయాలు

గువాహటి, డిసెంబర్ 23: అస్సాంలోని పశ్చిక కర్బీ ఆంగ్లాంగ్‌లో కర్బీ గిరిజనుల ఆధ్వర్యంలో మంగళవారం కూడా హింస కొనసాగింది. కొన్ని అల్లరి మూకలు గువాహటికి 190 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖెరోనీలో షాపులను, వాహనాలను దగ్ధం చేయడమే కాక, పోలీసులపై రాళ్లు, బాంబులు, బాణాలతో దాడులు చేశారు. ఈ దాడుల్లో ఇద్దరు మృతి చెందగా, ఒక ఐపీఎస్ అధికారి సహా 34 మంది పోలీసులు గాయపడ్డారు. అధికారులు ముందు జాగ్రత్త చర్యగా ఇంటర్నెట్ సర్వీసులను నిలిపివేశారు. రెండు వర్గాల ప్రభుత్వ భూముల నుంచి బయటి వ్యక్తులను ఖాళీ చేయించాలనే డిమాండ్‌పై కర్బీ గిరిజనులు చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారింది.





ఆటలు

@prathipaksham
prathipaksham tv telugu

ఢిల్లీకి కొత్త కెప్టెన్... జెమీమా

జనవరి 7 నుంచి మెగా టోర్నీ మహిళల ప్రీమియర్ లీగ్ ప్రారంభం కానుంది. ఈ సీజన్‌కు సంబంధించి ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ కొత్త కెప్టెన్‌ను ప్రకటించింది. మెగ్ లానింగ్ యుగానికి ముగింపు పలుకుతూ.. భారత మహిళల స్టార్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ కు ఈ బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు మంగళవారం సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది ఆ ఫ్రాంచైజీ. మెగ్ లానింగ్ సారథ్యంలో ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా మూడు సీజన్లలో ఫైనల్స్‌కు చేరింది. కానీ కప్పు అందుకోలేకపోయింది. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని భారత మహిళా క్రికెటర్లను కేంద్రంగా చేసుకుని ముందుకు సాగాలని యాజమాన్యం నిర్ణయించింది. అదే ఆలోచనలో భాగంగా 25 ఏళ్ల జెమీమాను కెప్టెన్‌గా ఎంపిక చేసింది. వన్డే ప్రపంచ కప్ 2025 నుంచి తాజాగా శ్రీలంకతో జరుగుతున్న టీ20 వరకు..జెమీ అద్భుత ఫామ్‌ను ప్రదర్శిస్తోంది. ఇప్పటివరకు 27 మ్యాచ్‌ల్లో 507 పరుగులు సాధించింది. 139.66 స్ట్రైక్‌రేట్ తో ప్రత్యర్థి బౌలర్లపై దాడి చేస్తూ తన సత్తా చాటింది. జెమిమా, వన్డే ప్రపంచకప్ 2025 సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాపై అజేయ శతకం బాదింది. అలాగే శ్రీలంకతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో విశాఖపట్నంలో 69 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచి మరోసారి తన క్లాస్‌ను నిరూపించింది. కెప్టెన్సీ విషయాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం ప్రత్యేకంగా తెలియజేసింది. అక్టోబర్‌లో ఫ్యాన్ మీట్ పేరుతో జెమిమాను పిలిచిన ఫ్రాంచైజీ, ఆమెకు తెలియకుండా ఈ నిర్ణయాన్ని సర్‌ప్రైజ్‌గా వెల్లడించింది. దానికి సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో ఢిల్లీ ఫ్రాంచైజీ పోస్ట్ చేసింది.



అదరగొట్టిన మహిళలు

రెండో టీ20లో ఇండియా విజయం

వన్డే ప్రపంచకప్ ఫైనల్లో మెరుపు అర్ధ శతకంతో టీమిండియా విజయంలో కీలకమైన షఫాలీ వర్మ(69 నాటౌట్) టీ20 సిరీస్‌లోనూ దంచేసింది. వైజాగ్ మైదానంలో మంగళవారం శ్రీలంక బౌలర్లను బెంబేలెత్తిస్తూ హాఫ్ సెంచరీతో చెలరేగింది. తనదైన స్టయిల్లో విధ్వంసం సృష్టించిన లేడీ సెహ్వాగ్ జట్టుకు భారీ విజయాన్ని అందించింది. స్వల్ప ఛేదనలో షఫాలీ మెరుపులతో ఏడు వికెట్ల తేడాతో లంకను టీమిండియా మట్టికరిపించింది. వరుసగా రెండో విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 20తో ఆధిక్యంలోకి వెళ్లింది. వైజాగ్‌లో భారత జట్టు ఆల్‌రౌండ్ షోతో శ్రీలంకను వణికించింది. స్పిన్నర్లు తిప్పేసి ప్రత్యర్థిని 128కే కట్టడి చేయగా.. చిన్నపాటి లక్ష్యాన్ని షఫాలీ వర్మ (69 నాటౌట్) తన విధ్వంసక ఆటతో కరిగించేసింది. స్మృతి మంధాన(14) ఔటయ్యాక గేర్ మార్చిన తను.. బౌండరీలతో స్టేడియాన్ని హోరెత్తించింది. ఆటపట్టు వేసిన ఆరో ఓవర్లో 4, 6, 4 బాది వైజాగ్ ప్రేక్షకులను అలరించింది. జెమీమా రోడ్రిగ్స్(26), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(10)తో కలిసి స్కోర్‌బోర్డును ఉరికించింది ఈ లెఫ్ట్ హ్యాండర్. కావ్య వేసిన పదో ఓవర్లో బౌండరీతో అర్ధ శతకం పూర్తి చేసుకుంది షఫాలీ. ఆ తర్వాత అదే ఊపులో గిహ్మాని ఓవర్లో రెండు ఫోర్లు బాదింది హిట్టర్. విజయానికి ఒక్క పరుగు అవసరమైన వేళ మదర ఓవర్లో లెగ్ సైడ్ షాట్ ఆడబోయిన హర్మన్ బౌల్డయ్యింది. ఆ తర్వాతి బంతికే రిచా ఘోష్(1 నాటౌట్) సింగిల్ తీయగా 7 వికెట్ల తేడాతో టీమిండియా గెలుపొందింది. టాస్ ఓడిన శ్రీలంక బ్యాటర్లను కట్టడి చేస్తూ.. వికెట్ల వేట కొనసాగించారు. శ్రీ చరణి(223), వైష్ణవి శర్మ(232) రెండు వికెట్లతో మెరవగా.. లంక స్కోర్ 120 మించలేదు. టీమిండియా స్పిన్నర్ల ధాటికి మిడిలార్డర్ కుప్పకూలగా సమరవిక్రమ(33), ఓపెనర్ చమరి ఆటపట్టు(31) రాణించారు. దాంతో.. పోరాడగలిగే స్కోర్ చేసేలా కనిపించిన లంకను వైష్ణవి, శ్రీచరణి నిలువరించారు. ఫీల్డింగ్ కూడా బాగా మెరుగుపడడంతో నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి పర్యాటక జట్టు 128 పరుగులే చేసింది.



చరిత్ర సృష్టించేందుకు రెడీ

టీమిండియా వెటరన్ ప్లేయర్ విరాట్ కోహ్లీ దాదాపు 15 ఏళ్ల తర్వాత దేశవాళీ టోర్నీలో ఆడుతున్న విషయం తెలిసిందే. బుధవారం నుంచి జరిగే విజయ్ హజారే ట్రోఫీలో విరాట్ ఢిల్లీ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఈ జట్టుకు టీమిండియా స్టార్ ప్లేయర్ రిషభ్ పంత్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. అంతర్జాతీయ వన్డే కెరీర్‌లో కోహ్లీ 14,557 పరుగులు చేశాడు. లిస్ట్‌ఏ క్రికెట్ లో ఓవరాల్‌గా ఇప్పటికి 15,999 పరుగులు పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో ఆంధ్రతో బుధవారం జరిగే మ్యాచ్‌లో మరో పరుగు చేస్తే.. లిస్ట్‌ఏ క్రికెట్ లో 16వేల పరుగులు మైలురాయిని అందుకుంటాడు. దీని ద్వారా ఈ ఫీట్ అందుకున్న భారత రెండో క్రికెటర్‌గా నిలుస్తాడు. ఈ జాబితాలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. లిస్ట్‌ఏ క్రికెట్ లో సచిన్ 21,999 పరుగులు సాధించాడు. కాగా వన్డేలతో పాటు విజయ్ హజారే ట్రోఫీ, భారత్‌ఎ, జోనల్ జట్ల తరఫున సాధించిన పరుగులను లిస్ట్‌ఏ జాబితాలో చేర్చుతారు. కాగా ఓవరాల్‌గా ఈ లిస్టులో ఇంగ్లండ్ క్రికెటర్ గ్రాహమ్ గూచ్ 22,211 పరుగులతో టాప్‌లో ఉన్నాడు.




అప్పుడే రిటైర్ అవాలనుకున్నా!

మూడేళ్ల క్రితం స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచ కప్ ఫైనల్లో ఓటమి తననెంతో కుంగదీసిందని మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ వెల్లడించాడు. 2023లో జరిగిన ఆ మెగా టోర్నమెంట్‌లో రోహిత్ కెప్టెన్సీలో టీమిండియా అద్భుత ప్రదర్శనతో తుది పోరుకు దూసుకొచ్చింది. కానీ టైటిల్ ఫైట్‌లో ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలైన సంగతి తెలిసిందే. 'ఆ మ్యాచ్ నా నుంచి అన్నీ తీసుకుపోయిందని అనిపించింది' అని గుర్గావ్‌లో మాస్టర్స్ యూనియన్ కార్యక్రమంలో మాట్లాడుతూ రోహిత్ పేర్కొన్నాడు. '2023 ప్రపంచ కప్ ఫైనల్ ఓటమితో తీవ్ర నిరాశకు లోనయ్యా. ఇకపై క్రికెట్ ఆడకూడదని నిర్ణయించుకున్నా' అని వెల్లడించాడు. 'ఆ పరాజయభారం నుంచి కోలుకొనేందుకు కొంత సమయం పట్టింది. నేను అమితంగా ప్రేమించే ఆటను వీడడమా అని పదే పదే ప్రశ్నించుకున్నా. జీవితం ఇంతటిలో ముగిసిపోలేదని, అవకాశాలు ఇంకా మిగిలి ఉన్నాయని నచ్చజెప్పుకొన్నా. దాంతో నెమ్మదిగా కోలుకున్నా. శక్తినంతా కూడదీసుకొని మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టా' అని రోహిత్ వివరించాడు. 'వరల్డ్ కప్ గెలవడం నా ప్రధాన లక్ష్యం. అది టీ20 ప్రపంచకప్ కావొచ్చు లేదా 2023 వరల్డ్ కప్ కావొచ్చు. కానీ అది జరగలేదు. మేమేకాదు అంతా నిరాశకు గురయ్యారు. జరిగిందేమిటో మాకు అంతుబట్టలేదు. వ్యక్తిగతంగానూ అది నాకు క్లిష్ట సమయం. ఎందుకంటే 2023 వరల్డ్ కప్ కోసం నేను ఎంతో కష్టపడ్డా. 2022లో నేను సారథ్య బాధ్యతలు చేపట్టినుంచే ప్రపంచ కప్ కోసం సమాయత్తమయ్యా' అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు.

పోస్ట్ ప్రొడక్షన్‌లో

'మన శంకర వర ప్రసాద్ గారు'

మెగాస్టార్ చిరంజీవి మాస్‌అండ్‌ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకర వర ప్రసాద్ గారు'. బ్లాక్‌బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రంఅద్భుతమైన ప్రమోషనల్ కంటెంట్ తో సంచలనం సృష్టిస్తోంది. విక్టరీ వెంకటేష్ కీలకమైన ప్రత్యేక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్‌ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తాజాగా మేకర్స్ సినిమా నుంచి రిలీజ్ చేసిన మెగాస్టార్ చిరంజీవి కొత్త స్టిల్ అదిరిపోయింది. బ్లాక్ సూట్, వైట్ షర్ట్, కళ్లకు డార్క్ గ్లాసెస్ తో ఒక చేతిలో గన్ పట్టుకుని స్టైలిష్‌గా, పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్న మెగాస్టార్ స్టిల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇప్పటికే మీసాల పిల్ల, శశిరేఖ పాటలు చార్ట్‌బస్టర్ హిట్స్ గా సంచలనం సృష్టించాయి. అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న చిరంజీవి, వెంకటేష్ పై చిత్రీకరించిన పాటని రిలీజ్ చేయబోతున్నారు. దీనికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ త్వరలోనే రాబోతోంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీని, తమ్మిరాజు ఎడిటింగ్‌ను, ఏఎస్ ప్రకాష్‌ప్రొడక్షన్ డిజైన్‌ను చూసుకుంటున్నారు. కథను ఎస్. కృష్ణ, జి. ఆదినారాయణ సంయుక్తంగా రాశారు. భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న మన శంకర వర ప్రసాద్ గారు జనవరి 12న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కానుంది.





'ఈషా' భయపెడుతుంది!

'ఈ కథ విని షాకయ్యాను. హారర్ థ్రిల్లర్స్‌ని ఇష్టపడేవారికి కొత్త అనుభూతినిచ్చే సినిమా ఇది. ఈ కథలోని మలుపులు, దానికి తగ్గట్టు ఆర్‌ఆర్ ప్రేక్షకుల్ని ట్రాన్స్‌లోకి తీసుకెళ్తాయి. థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇది.' అని హీరో అఖిల్‌రాజ్ అన్నారు. త్రిగుణ్, హెబ్బాపటేల్‌లతోకలిసి ఆయన నటించిన హారర్ థ్రిల్లర్ 'ఈషా'. శ్రీనివాస్ మన్నె దర్శకుడు. హేమ వెంకటేశ్వరరావు నిర్మాత. ప్రముఖ నిర్మాత కేఎల్ దామోదరప్రసాద్ సమర్పకుడు. ఈ నెల 25న క్రిస్మస్ కానుకగా బన్నీవాస్, వంశీ నందిపాటి ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా అఖిల్‌రాజ్ మంగళవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. 'బన్నీవాస్, వంశీ నందిపాటి జడ్జిమెంట్ ఉన్న నిర్మాతలు. 'లిటిల్‌హార్ట్స్'తో నవ్విస్తామని చెప్పి నవ్వించారు. మా 'రాజా వెడ్స్ రాంబాయి'తో ఏడిపిస్తామని చెప్పి ఏడిపించారు. ఈ సినిమాతో భయపెడతాం అని చెప్పారు. సో.. కచ్చితంగా మీరంతా భయపడి తీరతారు. అందుకే హార్ట్ వీక్ ఉన్న వాళ్లు సినిమా చూడొద్దని చెప్పాం' అని గుర్తు చేశారు అఖిల్‌రాజ్.



సిగ్మా. టీజర్ రిలీజ్

సుబాస్కరన్ లైకా ప్రొడక్షన్స్ మరో ప్రతిష్టాత్మక వెంచర్ సిగ్మా తో రాబోతోంది. ఈ సినిమాతో కోలీవుడ్ సూపర్ స్టార్ దళపతి విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. సందీప్ కిషన్ హీరో నటిస్తున్న ఈ చిత్రం యాక్షన్‌అడ్వెంచర్ కామెడీగా రూపొందుతోంది. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ కు అద్భుతమై రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మేకర్స్ అదిరిపోయే టీజర్ రిలీజ్ చేశారు. 'మంచోడు.. మహానుభావుడు.. చెడ్డోడు రాక్షసుడు.. చూసే నీ చూపుని బట్టి, ఇప్పుడు ఈ క్షణం నన్ను నేను కాపాడుకోవడానికి ఎలాగైనా మారుతాను' అనే హీరో పవర్ ఫుల్ డైలాగ్ తో టీజర్ ప్రారంభమవుతుంది. ఈ లైన్ వెంటనే కనెక్ట్ అవుతూ విజిలెంట్ కథని సూచిస్తుంది. దర్శకుడిగా జేసన్ సంజయ్ తొలి అడుగే బలమైన స్టేట్‌మెంట్‌లా కనిపిస్తుంది. స్టైలిష్‌గా, హైఆక్టేన్ కట్స్‌తో రూపొందిన ఈ టీజర్‌లో ఆయన కాన్ఫిడెన్స్ స్పష్టంగా కనిపిస్తుంది. ఎస్. తమన్ అందించిన దుమ్మురేపే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు ఎనర్జీ, ఇంటెన్సిటీని మరింత పెంచింది. డైలాగ్స్, విజువల్స్ చూస్తే సిగ్మా పూర్తిగా విజిలెంట్ హీరో జానర్ తో ఆకట్టుకుంది. ఇది దళపతి విజయ్‌తో అనుసంధానమై ఉన్న స్పేస్ అయినప్పటికీ, జెన్‌జీ టచ్‌తో అద్భుతంగా ప్రజెంట్ చేశారు. విజువల్‌గా టీజర్ చాలా రిచ్‌గా, క్లాసీగా ఉంది. సినిమాటోగ్రాఫర్ కృష్ణన్ వసంత్ కెమెరా వర్క్ ప్రతి ఫ్రేమ్‌ను ఎలివేట్ చేస్తూ, సినిమాకు గ్రాండ్ సినీమాటిక్ ఫీల్ ఇస్తుంది. లైకా ప్రొడక్షన్స్ మరోసారి తమ హై ప్రొడక్షన్ వాల్యూస్‌తో సినిమాను పెద్ద స్థాయిలో ప్రజెంట్ చేసింది. సందీప్ కిషన్ అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో టీజర్ లో అదరగొట్టారు. యాక్షన్, ఇంటెన్సిటీ, ఎనర్జీ—మూడు అంశాల్లోనూ ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ అదిరిపోతుంది. అంతర్గత సంఘర్షణ, ఆశయం, సహజ స్వభావంతో మలచబడిన పాత్రలో ఆకట్టుకున్నారు. ఇంతకుముందెన్నడూ చూడని హైఇంపాక్ట్ యాక్షన్ అవతార్‌లో సుందీప్ కిషన్ రా అగ్రెషన్‌కి స్టైలిష్‌స్వాగ్‌ని అద్భుతంగా క్యారీ చేశారు.

'శంబాల' లాంటి చిత్రాల్ని థియేటర్లోనే చూడాలి

హీరో ఆది సాయి కుమార్

ఆది సాయి కుమార్ హీరోగా తెరకెక్కిన 'శంబాల' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్‌లు, పోస్టర్లు, పాటలు ఇలా అన్నీ కూడా ఆడియెన్స్‌లో మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి. డిసెంబర్ 25న ఈ చిత్రం గ్రాండ్‌గా రిలీజ్ అవుతోంది. డిసెంబర్ 23న ఆది సాయి కుమార్ పుట్టిన రోజు సందర్భంగా మీడియాతో ముచ్చటిస్తూ 'శంబాల' గురించి ఎన్నో విషయాల్ని పంచుకున్నారు.

'శంబాల'పై మంచి బజ్ ఏర్పడింది? ఈ చిత్రంపై పెరిగిన అంచనాల గురించి మీరేం చెబుతారు?

'శంబాల' చిత్రం బాగా వచ్చింది. ఆడియెన్స్‌కి మా సినిమా బాగా నచ్చుతుంది. అందరూ మా మూవీని ఎంజాయ్ చేస్తారని అనుకుంటున్నాను.

డిసెంబర్ 25న చాలా కాంపిటీషన్ ఉంది కదా? శ్రీకాంత్ తో మీకు మంచి ఫ్యామిలీ బాండింగ్ కూడా ఉంది. ఈ కాంపిటీషన్‌ను ఎలా చూస్తారు?

క్రిస్మస్, డిసెంబర్ 25 అనేది మంచి సీజన్. శ్రీకాంత్ గారి ఫ్యామిలీతో మాకు మంచి బాండింగ్ ఉంది. రోషన్‌తో నాకు మంచి పరిచయం ఉంది. మా క్రికెట్ టీంలో రోషన్ చురుకుగా ఉంటాడు. రోషన్ నటించిన 'ఛాంపియన్' సినిమా కూడా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను.

'శంబాల' నుంచి వచ్చిన ప్రతీ కంటెంట్ వైరల్ అయింది కదా? సినిమా మీద చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నట్టున్నారు?

'శంబాల' స్టిల్ వదిలిన క్షణం నుంచి మంచి బజ్ ఏర్పడింది. దుల్కర్ గారు, ప్రభాస్ గారు, నాని గారు వదిలిన టీజర్, ట్రైలర్‌లు మంచి రెస్పాన్స్‌ను దక్కించుకున్నాయి. ఆడియెన్స్‌లో మా మూవీ పట్ల మంచి బజ్ ఏర్పడింది. ఈ సారి మేం మంచి విజయాన్ని అందుకోబోతోన్నామనే కాన్ఫిడెన్స్ ఉంది.

మన పురాణాల్లోని 'శంబాల' గురించి మీకు తెలుసా?

'శంబాల' అనేది ఉందా? లేదా? అనేది ఎవ్వరికీ తెలీదు. మన పురాణాల ప్రకారం శంబాలకి ఓ మంచి గుర్తింపు ఉంది. శంబాల అని టైటిల్ చెప్పినప్పుడే నేను చాలా ఎగ్జైట్ అయ్యాను. ఈ కథ విన్న కొన్ని రోజులకే 'కల్కి' రిలీజ్ అయింది. ఆ తరువాత శంబాల పేరు మరింత ఎక్కువగా ట్రెండ్ అయింది.

'శంబాల' చిత్రీకరణ సమయంలో గాయాలయ్యాయని విన్నాం?

షూటింగ్‌లో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కూడా ఏదో ఒక సందర్భంలో గాయాలు అవుతుంటాయి. ఫైర్‌తో ఓ సీక్వెన్స్ ఉన్నప్పుడు చిన్నగా గాయమైంది. పోరాట సన్నివేశాల్లో గాయాలు అనేవి కామన్.

ప్రస్తుతం ఆడియెన్స్ థియేటర్ కంటే ఓటీటీల్లోనే సినిమాలు ఎక్కువ చూస్తున్నారు కదా?

ప్రస్తుతం ఆడియెన్స్‌కు అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ కావాలి. ఇలాంటి జానర్‌లను ఆడియెన్స్ ఎక్కువగా ఇష్టపడుతున్నారు. మా టీం నుంచి వచ్చిన ప్రతీ పోస్టర్, ప్రతీ కంటెంట్ ప్రేక్షకుల్లో అంచనాల్ని పెంచేసింది. మా చిత్రానికి మంచి బజ్ అయితే ఏర్పడింది. మా నిర్మాతలు ఎక్కడా కూడా కాంప్రమైజ్ కాకుండా భారీ ఎత్తున నిర్మించారు. మా ప్రమోషన్స్ అయితే ఆడియెన్స్‌ను ఆకట్టుకున్నాయి. 'శంబాల' లాంటి చిత్రాల్ని థియేటర్లో చూస్తేనే ఆ ఫీల్‌ను ఎంజాయ్ చేయగలుగుతారు.

అమ్మ గారు ఈవెంట్లో చెప్పిన డైలాగ్ బాగా వైరల్ అయింది కదా?

నాకు, అమ్మకి మంచి బాండింగ్ ఉంటుంది. ఇంట్లో ఎప్పుడూ కూడా అలా డైలాగ్ చెప్పలేదు. కానీ ఆమె ఈవెంట్ లో అలా డైలాగ్ చెప్పడం చూసి నేను కూడా షాక్ అయ్యాను.

డిసెంబర్ 25కి చాలా కాంపిటీషన్ ఉంది కదా? వేరే డేట్ ఏదైనా మళ్లీ అనుకున్నారా?

డిసెంబరర్ 25 డేట్‌ని వదులుకుంటే మళ్లీ ఇంత మంచి డేట్ నాకు దగ్గర్లో కనిపించలేదు. మేం ప్రీమియర్లతో ముందుకు వస్తున్నాం. ఇప్పటికే ప్రీమియర్లకు మంచి స్పందన వస్తోంది. ప్రీమియర్ల నుంచి పాజిటివ్ టాక్ బయటకు వెళ్తే.. డే వన్ నుంచే పికప్ అవుతుంది. కానీ ఈ డేట్ కి టఫ్ కాంపిటీషన్ అయితే ఉంది.

'శంబాల'లోని పాత్రకు మీ రియల్ లైఫ్ కారెక్టర్‌కు ఉన్న తేడా ఏంటి? మీకు మూఢ నమ్మకాలున్నాయా?

నాకు మరీ పెద్దగా మూఢ నమ్మకాలు అయితే లేవు. చిన్న చిన్న వాటిని నమ్ముతాను. ఇంట్లో పాటించే సెంటిమెంట్స్‌ను మాత్రం నమ్ముతాను.

'శంబాల' చిత్రీకరణలో ఎదురైన సవాళ్లు ఏంటి?

'శంబాల' సినిమాను దాదాపు విపరీతమైన చలిలో నైట్ షూట్ చేశాం. క్లైమాక్స్ పార్ట్ మొత్తం నైట్ షూట్‌లోనే జరిగింది. ఎంత కష్టమైనా కూడా అందరం ఇష్టంతో కలిసి పని చేశాం.

'శంబాల' మూవీలోని కారెక్టర్స్ గురించి చెప్పండి?

'శంబాల' చిత్రంలో అన్ని పాత్రలు బాగుంటాయి. అర్చన కారెక్టర్ నాతోనే ప్రయాణం చేస్తుంటుంది. ఆమె పాత్ర అందరినీ ఆకట్టుకుంటుంది.

'శంబాల' పార్ట్ 2 తీస్తారా?

'శంబాల'ని హిట్ చేస్తే.. పార్ట్ 2 ప్లాన్ చేస్తాం.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200